# దేవుడైన మానవుడు

సుమారు పదిహేడున్నర సంవత్సరాల క్రితంమాట. ఆనాడు గోదావరీ పరిసర ప్రాంతాలలో పెద్ద తుఫాను వీచింది. గోదావరిలో అప్పుడు 'డరోతీ' అనే పెద్ద స్టీమరొకటి ఉండేది. దానిలో వెయ్యికి పైగా జనం ఇమిడేవారు. అది పశువుల్ని, మనుష్యుల్ని, కారుల్నీ, బొబ్బర్లంకనుండి రాజమండ్రికి, రాజమండ్రినుండి బొబ్బర్లంకకు చేర్చేది. అది, ఎనిమిది వందల గజాల స్థలంలో కట్టిన గుండ్రపాటి పెద్దరెండంతస్థుల భవంతిలా ఉండేది. అది గోదావరిలో తిరుగుతూవుంటే ఎంతోనిండుగా ఉండేది. కాని ఆ నిండుతనాని కానాడు దురదృష్టం పట్టింది. ఆనాటి రాత్రి ఒడ్డున కట్టివేయబడ్డ ఆ స్టీమరు ఎలా లంగరు లాక్కొని గోదావరిలోకి వెళ్ళిపోయిందో తెలియదు. ఆ పెనుగాలి తాకిడికి అంత పెద్దదికూడా తట్టుకోలేకపోయింది. అలా దిగువగాపోయి బొబ్బర్లంకకు కాస్త దూరంలో మునిగిపోయింది. ఆ స్టీమరులో జనం ఎవ్వరూ లేకపోవడంవల్ల ప్రాణహాని మాత్రం జరుగలేదు. రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా ఆ మరునాడు రాజమండ్రినుండి బొబ్బర్లంక కొక లాంచీ బయలుదేరింది. అప్పటికి తుఫాను భీభత్సంకూడా కొంత తగ్గిపోయిందనే చెప్పాలి. కాని వర్షం అలా తెరలుతెరలుగా కురుస్తునేఉంది. గడ్డ కట్టుకపోయిన ఒక మహార్ణవం ఆకసమంతానిండి, రవి కడ్డుగా నిలిచినట్లుంది. ఇటునుంచి జనం అయిదారుగురుకన్నా, ఎక్కువ ఎక్కనేలేదు. అటునుంచైనా పది పదిహేను మందికి మించిలేరు. అందులో ఓ గర్భిణీ స్త్రీ

కూడా ఉంది. రాజమండ్రిలో అత్యవసర వైద్యసహాయం పొందటానికి పల్లెటూరైన పుట్టినుండి తిరిగి అత్తవారి ఊరైన రాజమండ్రి వచ్చేస్తూంది. ఆమెకు తోడుగా ఆమె అన్నగారు, మరొక ఆడమనిషి ఆ లాంచీలోనే వస్తున్నారు.

లాంచీ అంతా చెమ్మగానే ఉంది. పొడిగాఉన్న స్థలం ఒక్క జానెడుకూడా లేదు.

సరంగు, డ్రైవరుతో ఏమిటో గుసగుస లాడాడు. వాళ్ళిద్దరి మొగాలు వికృతముగానే ఉన్నాయి. వాళ్ళ మొగాల లోనికి దిగులుగాచూసిన జనం—వాళ్ళేమి మాట్లాడుకున్నారో తెలుసుకోవాలని ఆత్రుతపడ్డారు. ఒకాయన, "మరేం ఫరవా లేదుకదా బాబూ..." అన్నాడు. సరంగు ఒక నవ్వు నవ్వాడు. ఆ నవ్వులో నవ్వులేదు. ఆ నవ్వులో ఏమున్నదో అందులో కూర్చున్నవారి కంతుపట్టలేదు.

లాంచీ ఇక బయలుదేరబోతూందనగా అకస్మాత్తుగా ఒక ప్రయాణీకుడు త్రొక్కుడుచెక్క లేకపోయినా నీళ్ళల్లోనికి దుమికేసి, గట్టుమీదికి పారిపోయాడు. మిగిలినవారి గుండెలు రెపరెప లాడిపోయాయి. అట్లాదిగి వెళ్ళిపోతూన్నవాని దిశగా సరంగు తిరిగిచూచిన చూపు—అప్పుడతను తుపుక్కున ఉమ్మిన ఉమ్మి—అవలోకించిన ఆ జనం, అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని లాంచీ దిగిపోవడానికి ధైర్యముచాలక, ముందుకు వెళ్ళడానికి మనసొప్పక, బిక్కుబిక్కుమంటూ ఒకరిమొగాల్లో ఒకరు తమ ప్రాణాల్ని తడిమి చూసుకున్నారు.

సరంగు గట్టిగా 'గో హైట్' అని ఓ పెద్ద పొలికేక పెట్టాడు. లాంచీ ముందుభాగాన చుక్కానిత్రిప్పే చక్రంవద్ద

అతను కూర్చున్నాడు. అతని దృష్టిఅతి నిశితంగాఉంది. లాంచి మధ్యభాగాన ఇంజనుదగ్గరవున్న డ్రైవరు లాంచి వేగము యొక్క హెచ్చుతగ్గుల మార్పులగురించి ఎప్పటికప్పుడు సరంగు ఇచ్చే సూచనల కనుగుణంగా నడచుకుంటున్నాడు. వీరిద్దరూ మాట్లాడుకోడానికి వీలుగా ఓ గొట్టం ఉంది. ఇంజను గది యొక్క ఆ వైపు ఈ వైపు తలుపులు వేసి ఉండడంవల్ల, సరంగుకు డ్రైవరుకాని, డ్రైవరుకు సరంగుకాని కనిపించరు. ఇంజనుకు అవతలి భాగంలో ఆడవారు, ఇవతలి భాగంలో మగవారు ఉన్నారు.

ఇంజను చేసే శబ్దం మినహాయిస్తే మరి అక్కడ కూర్చున్నవారు చేసే శబ్దాలేవీ లేవు. చనిపోయిన ఒక ధనవంతుని శవాన్ని, అతి విషాదంగా మోసుకువస్తున్నట్లు లాంచి గమనాన్ని సాగిస్తూంది. మధ్య మధ్య సరంగు కేకలు, అతను చక్రసహాయంతో చుక్కానిని త్రిప్పుతూన్నప్పుడు, దాన్నిత్రిప్పే గొలుసుయొక్క వదులు బిగువుల రవరవలుతప్ప మరేగొడవా లేదు. కాని అప్పుడప్పుడు భయంకరంగా వీచేగాలుల కుత్తుకలు త్తరించే నినాదాల వికటాట్టహాసాలు, అత్యంత వేగంగా శక్తివిసురుగా మీదకురికే నీటిజల్లుల నియంతృత్వపు ధోరణులు అందులో కూర్చున్నవారిని ఒక ఊపు ఊపుతున్నాయి. చలితో ప్రతిఒక్కడూ కుదించుకొని ముడుచుకపోయాడు. లేస్తూన్న పెద్ద పెద్ద అలలతాకిడికి లాంచీ అటునిటు కదలిపోతూంది. సరంగు మరొకసారి కంఠాన్ని పెద్దదిచేసి "ఫుల్ స్టీమ్" అన్నాడు. ఇంజను తనకున్న శక్తినంతా ఉపయోగించి ఎదురు గాలులతో పోరాడుతూంది. కొంత సేపయ్యేప్పటికి లాంచీ ముందుకు వెళ్తూందో, వెనక్కి వెళ్తూందో తెలియ

లేదు. గాలియొక్క వేగం రెచ్చిపోతూంది. నదిలో కెరటాలు ఎంతఎత్తుకు లేస్తున్నాయో, అంతలోతుకు దించుకపోతున్నాయి. లాంచీ కాగితపు పడవవలె అయిపోతూంది. ఒక్కసారిగా లాంచీలో ఉన్నవారు గొల్లున చుట్టుకుపోయారు. సరంగు కన్నులూడిపోయేలా ఒక వెర్రికేక పెట్టాడు. మహా ప్రళయంగా అరిచాడు. ఒక్కసారిగా లోనున్నవారి కంఠాలు బిగుసుకుపోయాయి. అంతా నిశ్శబ్దం. గాలి...హోరు...కెరటాల తాకిడులు తప్ప మరేమీలేదు.

లాంచీలోఉన్న గర్భిణి విపరీతంగా నొప్పులు పడుతూంది. ఆమె చేతులు సహాయం కోసం కొట్టు మిట్టాడుతున్నాయి. ఆమె మొగం ఓరగా తిరిగిపోయి విలవిల తన్నుకుంది.

వర్షం మహోద్ధృతంగా, జలమేదో ఆకసమేదో విడమర్చ లేని ఏకస్థాయిలో కురుస్తూంది. ఒకపెద్ద అలలేచి లాంచిని ఒక చెంపపెట్టుపెట్టి, కొటానుకోట్ల చీలికలుగా చీలిపోయి లోపలి జనాన్ని తడిపివేసింది. ఇంకేమున్నది! ఒకసారి అంతా గొల్లున, "అమ్మోయ్" అన్నారు. "అమ్మా గోదావరీతల్లీ...మా పాపాలు క్షమించుతల్లీ...నీబిడ్డలము తల్లీ...మా అమ్మా....గోదావరీతల్లీ...." అని ఒకటే ఆక్రందన చేస్తున్నారు. ఇంతలో మరొక ప్రచండమారుతముపీచి, పెల్లుబికిన కెరటాల ఉద్ధృతాన్ని లాంచిలోనికి ముంచెత్తింది. "కేర్" మని ఒక బిడ్డ అరుపు ఆకసాన్ని చీల్చివైచింది. ఆ బిడ్డ కంఠధ్వని వినగానే గోదావరి ఒక్కసారిగా వెనక్కి తిరగబడింది. లాంచీ ఒక్కడుగు ముందుకు సాగింది. సరంగు అంత చలిలోనూ నుదుటికి పట్టిన చెమట మెల్లగా తుడుచుకున్నాడు.

మెల్లగా గాలి హోరుతగ్గింది. కెరటాలజోరు కొద్దిగా సమసిపోయింది. కొంతసేపటికి లాంచి చల్లగా ఒడ్డుకుచేరుకుంది.

## 2

ఆ వేళ ఆ గాలివానలో, ఆతల్లి ప్రసవ వేదనలో పుట్టిన వాడే మన జగన్నాథం. వాడు పుట్టిన నాటినుంచీ గోదావరిని ఎరుగును. వాళ్ళమ్మ వాణ్ణి ఎత్తుకొని పండుగ దినాలలో ఆ గోదావరి గట్టున త్రిప్పింది. కాస్త ఊహ తెలిసిన దగ్గరనుంచీ వాడు వాళ్ళ నాన్నతో గోదావరీస్నానానికి వచ్చేవాడు. ఇది వాళ్ళమ్మకు ఇష్టంగా ఉండేదికాదు. కాని వాడు మారాంచేసి మరీ, వాళ్ళ నాన్న వెనుక గోదావరికి వెళ్ళకుండా ఉండేవాడు కాదు.

ఇహ ఆ తల్లిఒడిలో వాడు ఈతలుకొట్టేవాడు. ఆ దేవి మనసులో బుడబుడ మునిగేవాడు. గడబిడగా నీటిపైన చేతులుకొడుతూ చిలిపిగా నవ్వేవాడు.

ఆ వీధిలోని పిల్లలతో కూడి వేసవిలో మధ్యాహ్నపు వేళల బ్రిడ్జి రేవువద్ద ఈతలపందేలు వేసేవాడు. ఆ స్థంభాల వద్దకుపోయి, ఆ మెట్లమీదనుంచి. నీటిలోనికి ఒక్క దుముకు దుమికి ఆకుపచ్చా, నీవిరంగూ కలగలపు నీళ్ళల్లోంచి తెల్లని నీటిమీదకు తేలేవాడు.

వాడెప్పుడూ అల్లరి చిల్లరిగా తిరిగేవాడు కాదు. స్కూలు విడిచిపెట్టగానే చీకటి పడేవరకు ఆటలాడుకొని తిన్నగా ఇంటికి వచ్చేసేవాడు. స్నానం చేసి భోజనం చేసి హాయిగా రెండు గంటలసేపు స్థిరంగా ఎక్కడికీ కదలకుండా

చదువుకొనేవాడు. తెల్లవారుఝామున లేచి శాస్త్రపు చదువు కొని, వాళ్ళ నాన్నతో కలసి గోదావరికి వెళ్ళేవాడు. ఏరోజునా గోదావరికి వెళ్ళడంమాత్రం తప్పేవాడుకాదు.

రాజమండ్రి అంటే వాడికి తగనిప్రేమ. ఆ వూరుగురించి ఎవరేమి చెప్పినా ఆ పసివాడు శ్రద్ధగా వింటాడు. రాజరాజ నరేంద్రుని గురించి, నన్నయగురించి, తమ పుస్తకాలలో నాలు గైదు పంక్తులకన్నా లేకపోవడం వాడికెంతో బాధ కలిగిం చేది. వీరేశలింగంగారి విగ్రహంముందు ఆ చిట్టితండ్రి వెర్రిగా చూస్తూ అలా ఎంతసేపో నిలబడి పోయేవాడు. బ్రహ్మాండమైన ఆ బ్రిడ్జి, నాల్గుమైళ్ళ పొడవుగల ఆ ఆనకట్ట, వాడికేదో అని ర్వాచనీయమైన ఆనందాన్ని చేకూర్చేవి.

భాస్కరం, జగన్నాధానికి ముఖ్యాతిముఖ్య స్నేహి తుడు. అతడు జగన్నాధాన్ని ఎప్పుడూ అంటిపెట్టుక తిరిగే వాడు. వీలుగా ఉన్నప్పుడల్లా వాళ్ళిద్దరూ సాయంకాలం గోదా వరి ఒడ్డుకుపోయి కూర్చునేవాళ్ళు. భాస్కరం ఎప్పుడూ వాళ్ళింటి గొడవా, లేకపోతే వాళ్ళ లాంచిగొడవా, జగన్నా ధానికి అట్లాంటి తీరిక సమయాల్లో చెప్పుతూ ఉండేవాడు. పాపం జగన్నాధానికి అలా చెప్పుకోడానికేమీ ఉండేవి కావు.

భాస్కరం తనసోది తను చెప్పుకపోతూ ఉంటే, జగ న్నాధం. గోదావరిమీంచి వచ్చే చల్లని గాలుల్ని, ఆ గాలుల తాకిడికి మోహనంగా ఇట్టే కదలిపోయే బుల్లి అలల కదలికల్ని, అస్తమిస్తూన్న సూర్యుని కిరణాలు అడ్డువచ్చే మబ్బుల్ని చీల్చు కొని పైకి "ఫోకస్" అవుతూన్న విధంలోని అందచందాల కొమరుతనాన్నీ, ఒక నల్లని పెనుమబ్బు తలపైన బహు నేర్పుగా

ఏర్పడ్డ వంపుల కనుగుణంగా సాగి, జీవం పుణికి పుచ్చుకున్న తటిల్లతలా, మెరసిపోయే బంగరుగీటు రామణీయకతనీ చూస్తూ ఈ జగత్తునే మరచిపోయేవాడు.

జగన్నాథం తీరిక వేళల వాళ్ళ నాన్నగారి ఫ్యాన్సీషాపు మీద కూర్చునేవాడు. అక్కడ ఉన్నంతసేపూ తండ్రికి ఎంతో సహాయపడేవాడు. తండ్రి, కొట్టుకురావడానికి వీలుపడని రోజుల్లో అతను అక్కడి పనులనెంతో నేర్పుగా చక్కబెట్టే వాడు. ఇల్లాంటి కొడుకును కన్నందుకు ఆ చుట్టుపక్కలవాళ్ళు కుటుంబరావుగార్ని ఎంతో పొగిడేవారు.

జగన్నాథం తల్లి కాంతమ్మగారు. ఆమె మనస్సు పాపం ఎప్పుడూ జగన్నాథంమీదే ఉంటుంది. వాడితో ఆమె ఎప్పుడు కాస్త సావకాశంగా మాట్లాడినా, వాడు పుట్టిననాడు జరిగిన సంఘటనలన్నీ విపులంగా చెపుతుంది. ఇంటికి ఎవ్వరు క్రొత్త వారొచ్చినా ఈ విషయాల నామె పాపం వారికి ఏదో సందర్భాన చెప్పకుండా ఉండలేదు.

ఆమె తన అన్నగారి కూతుర్ని వాడికి చేసుకోవాలని ఎంతో సంబరపడుతూంది. వాళ్ళుకూడా ఎక్కువగా రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. ఆ పిల్ల రెండుమూడుసార్లు ఈ వూరు వచ్చింది. జగన్నాథం మరీ చిన్నప్పుడు కాబోలు వాళ్ళ మేనమామగారి ఊరికి వాళ్ళమ్మతో వెళ్ళాడు.

ఆ అమ్మాయి అప్పుడెప్పుడో ఈవూరు వచ్చింది కాని, ఆమె జగన్నాథాన్ని కాని, జగన్నాథం ఆమెనుగాని ఓనాడూ తిన్నగా చూసుకోలేదు, ఆ పిల్ల ఉన్న నాలుగు రోజులూ వాడు ఇంట్లో ఉంటే "కాబోయే పెళ్ళాన్ని ఎక్కడ విడిచి

పెట్టలేక పోతున్నావేరా...." అనీ, వాడింట్లో ఉండకుండా ఎక్కడికో పోయి ఆలస్యంగా ఇంటికివస్తే, "మీ ఆవిడ నీమీద బెంగపెట్టుకుందోయ్" అనీ ఆ చుట్టుప్రక్కల ఉండే అమ్మలక్కలు వాణ్ణి చచ్చే సిగ్గులో ముంచేసేవారు. వాడిట్లాండి వెందువల్లనో భరించలేకపోయేవాడు. అంచేతనే వాడు సాధ్యమైనంతవరకు ఆ రోజుల్లో అక్కడ ఉండకుండా వుండేందుకే ప్రయత్నించేవాడు. కాని వాడికి ఆపిల్లను చూడాలనీ ఉండేది. ఆ పిల్లతో మాట్లాడాలనీ ఉండేది. చూడటమంటే ఏ మూల నుంచో ప్రక్కచూపులతో చూస్తాడు. కాని మాట్లాడటమంటే ఎలా....? ఏం మాట్లాడాలి? ఎలామాట్లాడాలి? వాడికి వేవీ తోచేవికావు. మేనకోడలితో మాట్లాడటానికే వాడికింత సిగ్గెందుకో! పాపం ఆ పిల్లకూడా జగన్నాధంలాగే సిగ్గుల దొంతర! ఒకసారిద్దరూ సన్నగా చూచుకున్నారు. చిన్నగా నవ్వుకున్నారు. చూసినప్పుడు వారి అందాల కళ్ళు, నవ్వినప్పుడు వారి తెల్లని పళ్ళు, తళతళా మెరిశాయి. ఇంతలోనే ఎంతో సిగ్గు ముంచుకొచ్చింది. అంతే.. ఆ పిల్ల ప్రక్క గది లోనికి, ఈ పిల్లవాడు వీధిగుమ్మములోనికి తొలివతీశారు. ఈ దృశ్యాన్ని చూసి జగన్నాధం తల్లి యెంతో ముచ్చటపడింది.

## 3

ఒకరోజున జగన్నాధం వాళ్ళ నాన్నతో, "ఈ భీష్మ కాదశికి భద్రాచలం వెళ్తానునాన్నా...." అన్నాడు. ఆయన కొడుకువైపు ఒకసారి చూసి, "ఏం...అలాపోయింది బుద్ధి" అన్నాడు కొద్దిగా నవ్వుతూ.

జగన్నాథం, "అదికాదునాన్నా ... మన భాస్కరం లేడూ వాళ్ళ లాంచీలో వెళుతానునాన్నా. ఒక్క కానీకూడా ఖర్చుకాదు. వాడుకూడా వస్తున్నాడు. ఇద్దరము సరదాగా చూసివస్తాము" అన్నాడు.

కుటుంబరావుగారి మనసులో ఏమేమిటో గిరున తిరిగినట్లయింది. ఆయన కాస్సేపేమీ మాట్లాడలేదు. ఆ తరువాత ఆయనే:

"ఏ శ్రీరామనవమికో అయితే బాగుంటుంది కాని ఇప్పు డేముంటుందిరా అక్కడ నీ ముఖం! అయినా ఇప్పుడీ చలిలో ఏమిటీ..." అని జగన్నాథాన్ని ఆ ప్రయాణంనుంచి ఆపుచేయబోయాడు.

అయితే జగన్నాథం ఊరుకోవద్దూ. "అబ్బ! చలేమిటి నాన్నా...నువ్వే ఇలా అంటే అమ్మ అసలే వెళ్ళొద్దంటుంది" అన్నాడు. 'తప్పకుండా నువ్వు ఒప్పుకోవాలి నాన్నా' అన్నట్టు వాడి కంఠం ధ్వనించింది.

అప్పుడే వాళ్ళమ్మ ఆ గదిలోని కేదో పనిమీదుగా వచ్చి "ఎక్కడకురా వెళ్ళడం" అంటూ అడిగింది.

జగన్నాథం అందుకు జవాబుగా ఏమీ మాట్లాడలేదు. నవ్వుతూ వాళ్ళ నాన్నవైపు చూశాడు. వాడలాచూస్తే ఆ తండ్రికి ఊరికే నవ్వొచ్చేస్తుంది. ఆయన ఆ నవ్వును ఆపుకోవాలని ఎంత ప్రయత్నించబోయినా, అది కనుకొసల్లోంచీ, పెదవి సందుల్లోంచీ, నీళ్ళతో నిండిన సీసాపై బిరడా పెడితే ఆ నీళ్ళు పైకి తన్నుకొచ్చినట్లు ముసి ముసిగా ఊడిపడుతూనే ఉంటుంది.

ఆయన సన్నగా నవ్వుతూ, "మీ అబ్బాయిగారు లాంచీలో భద్రాచలం వెళుతారట. ఎప్పుడో కాదు. ఈ ఏకాదశికే" అన్నాడు.

ఇంకేముంది? ఒక్కసారి ఆమె వాళ్ళిద్దరివైపు చూసి, "ఏమిటీ! లాంచీలో అంతదూరం ప్రయాణం చేస్తాడా? చాలా బాగుంది. ఒరే నువ్వెప్పుడో మా కొంపతీసేస్తావు. దానికి మీ నాన్నగారి మద్దత్తొకటి ఎప్పుడూ ఉంటుందిలే" అంది. ఆమె కంఠం ఎంతో బాధతో కదిలింది. ఆమె తన చిన్నారి పసికందు నెవ్వరో తన చేతుల్లోంచి ఊడబెరుక్కొని కంసు డిలా హతిమార్చేస్తున్నట్లు అంతులేని దుఃఖ భారంతో శూన్యంలోకి అవలోకిస్తూ అక్కడ నిలిచింది.

వెంటనే కుటుంబరావుగారు, "సరిసరి! ఇది చాలా బాగుంది. ఏరా......నిన్ను నేను వెళ్ళమన్నానా........? వాడు వెళ్ళడం నాకసలు ఇష్టమేలేదు. ఏమైనా ఒప్పుకుంటే ఇహ నువ్వే ఒప్పుకోవాలేమో......" అంటూ ఆయన ఎంత దాచుకోబోయినా సంపెంగపూపరిమళంలా ఆనవ్వు దాగనే లేదు. ఆ నవ్వుచూసి ఆమె మరింత దిగులుపడింది.

"ఔను మీకు నవ్వుతాలుగానే ఉంటుం. మీకేం" అంటూ, కొడుకువైపు తిరిగి, గట్టిగా "ఒరే...మీనాన్నగారు వెళ్ళమన్నా నువ్వు వెళ్ళటానికి వీల్లేదు. తెలిసిందా" అంది.

పాపం జగన్నాథం ఎంతో నిరుత్సాహ పడి పోయాడు. అయినా "అది కాదమ్మా....వాళ్ళు భాస్కరం నేనూ కలిసే వెళ్తున్నామమ్మా....ఆ లాంచి వాళ్ళ స్వంతం. వాళ్ళంతా మమ్మల్నెంతో ఇదిగా చూస్తారుకూడాను. అందులో ఇప్పుడు

గోదావరికి వరదలేముంటాయి. ఏమిటో నీదంతా పిచ్చిగాని" అన్నాడు.

"ఔనురా నాకుపిచ్చే. పోనీ పెద్దదికదా అని ఈ పిచ్చి దాని మాట ఎప్పుడు నిలబెట్టావురా? మా నాయనగా....ఆ లాంచీ ప్రయాణం మాత్రం మానేద్దూ...నీకెంతో పుణ్య ముంటుంది" అంది.

జగన్నాథానికి ఏమి మాట్లాడాలో తోచలేదు. గోదా వరిలో భద్రాచలంవరకూ ప్రయాణం చేయడంలో ఉండేపోయి తన తల్లి మూఢనమ్మకాలకు బలైపోతున్నట్టుగా బాధపడ్డాడు. "అమ్మా...ఈ ఒక్కసారికీ ఒప్పుకో అమ్మా..." అంటూ బుంగమూతి పెట్టాడు. 'ఈ ప్రయాణం ఏవిధంగానూ మానుకో కూడదు' అన్న పట్టుదలతో "అమ్మా...భాస్కరం అమ్మ— వాడు భద్రాచలం వెళుతాననగానే ఇట్టే ఒప్పేసుకుంది. అయినా నే నింకెప్పుడైనా లాంచీ ప్రయాణం చేస్తే అలాగ నమ్మా..."అంటూ ఇంక వాళ్ళమ్మ తప్పకుండా ఒప్పుకుంటుం దన్నంత ఆశతో ఆమెవైపు చూశాడు.

కాని, ఆవిడ "అయితే నీ పట్టు వదల వేమిటిరా... ఏమండీ...మీరుమాట్లాడరేం... వాడిని వెళ్ళొద్దని చెప్పరే మండీ...అసలు మీకు వాడి సంగతే పట్టదు. మిమ్మల్ని చూచుకునే వాడీ ఆట లాడుతున్నాడు" అంది.

కుటుంబరావుగారు వస్తూన్న నవ్వునాపుకుంటూ "ఓహో... ఇది మరీ బాగుంది. వాడ్ని ఒప్పించలేక ఇక నామీదకు తిరిగా వేమిటి? నీకన్నా ముందే చెప్పేను వాడికి. అయితేగట్టిగావాడు వెళుతానంటే... నేను మాత్రం ఏమిచేస్తాను. వాడైనా చిన్న

వాడా...చితకవాడా...కాస్త అవీ, ఇవీ చూడకుండా ఇంట్లో కట్టేస్తే వాడికి కాస్తయినా లోకజ్ఞానం కలగాలా... ఇంతలో మరేంకొంప మునిగిపోదులే. వెళ్ళనిద్దూవాడ్ని" అన్నాడాయన.

తండ్రి ఇట్లా మాట్లాడుతాడని జగన్నాధాని కెప్పుడో తెలుసు. దానితో ఒక్కసారిగా అతను ఎగిరి గంతేశాడు.

వాళ్ళమ్మ "సరే...మీఇష్టంవచ్చినట్లు కానీండి" అని జగన్నాధంవైపు తిరిగి "ఒరే నామాటవినవురా..." అంది బ్రతిమాలుతూ.

జగన్నాథం "అమ్మా!...మరేం ఫరవాలేదమ్మా... ఒక్క వారంలో ఇక్కడుండనటమ్మా". అంటూ వాడు వీధి లోనికి పారిపోయాడు.

కాంతమ్మగారు తన సర్వస్వమూ పోతూన్నట్లుగా దిగాలుగా ఒకమూల కూలబడిపోయింది.

## 4

భద్రాచలం ప్రయాణం వేసవిలోకన్నా శీతకాలంలో నే చెయ్యాలి. అప్పుడు మనసుకు కలిగే ఆహ్లాదం వేసవిలో ఏమాత్రం ఉండదు. కాని మనం చలికిమాత్రం తట్టుకోగలిగిఉండాలి.

జగన్నాథం దుప్పట్లూ, కోట్లూ హెచ్చుగా బెడ్డింగులో చుట్టుకొని ప్రయాణమయ్యాడు. వాడుబయలుదేరుతున్నప్పుడు వాళ్ళమ్మ వాడి కెన్నో చెప్పింది. అందులో ముఖ్యంగా. స్నానం చేసేప్పుడు నీళ్ళల్లోనికి మెలలోతుకన్నా దూరం

పోవొద్దని మరీ మరీ చెప్పింది. వాడు గుమ్మం దిగుతూవుండగా "నువ్వొ వంటరిగా ఎక్కడికైనా వెళ్ళావుగాక. నువ్వసలే తిన్ననైన వాడివికావు" అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. వాడు నవ్వుతూ "నాకేం భయంలేదమ్మా" అంటూ వీధిలోనికి నడకసాగించాడు. నడుస్తూనడుస్తూ, "అమ్మఎంతపిచ్చిది! ఎంత భయస్తురాలు" అనుకున్నాడు.

గోదావరిలో లాంచీ బయలుదేరింది. దానినిండా జనం కిటకిట లాడుతున్నారు. వారు భోజనసామాగ్రి, అరటిగెలలు, కొబ్బరికాయలు ఇత్యాది సామానులు అడ్డదిడ్డంగా వడేసి చిందర వందరగా కూర్చున్నారు. లాంచీ పైభాగానకూడా సామాను అదేవిధంగా ఉంది.

ఆప్రక్క, ఈప్రక్క పెద్దపెద్దచెట్లూ అల్లంత దూరాన అటూ, ఇటూ వృక్షా లధిరోహించిన ఎన్నో రకాల ఆకారాల కొండలూ, ఎట్టఎదుట ఎప్పటికీ దొరకనట్లుండే ఆకసంతో మబ్బులతో నున్నని చిట్టి ఆకసాల్లా ఉన్న పిల్ల కొండల ముద్దులొలికించే అందాలు, అన్నీ అన్నీ చూడగలిగే ప్రయాణీకుల కెంతైనా ఆనందాన్నిస్తున్నాయి. ఇహ అడుగడుగునా, గోదావరిదేవి మెల్లని నడకలతో, తెలినీలపు దీప్తుల సొగసు కలయికల చిరునగవులతో, ఒయ్యారపు ఒంపుల నృత్యభంగిమలతో సమస్తాన్నీ మరపింపజేస్తూంది.

మెల్లగా కొన్ని ఊళ్ళుదాటి లాంచీ పోలవరం చేరింది. ఆవూరు చేరేప్పటికి జగన్నాం తలగిర్రున తిరిగిపోయింది. ఆ పేరు వినగానే ఆతని కళ్ళముందు ఏవేవో దృశ్యాలు ప్రత్యక్షమయ్యాయి. వాడికళ్ళముందు కొక పెద్దమైదానం సినిమా

బొమ్మలావచ్చింది. ఆ మైదానంలో జనం వసంతకాలంలో గుబురుగా పెరిగిన చెట్ల ఆకుల్లా కిటకిటలాడుతున్నారు. అంతా నిశ్శబ్దం. ఒకే ఒక వ్యక్తి కంఠం ఆనిశ్శబ్దతను చీల్చి చెప్పు తూన్న విషయాన్ని ప్రజలు, చల్లనిగాలి తాకిడికి తన్మయత్వం లో మునిగిపోయే ఆ మధుమాసపు వృక్షసంతతి శాఖా పత్రాల్లా సమ్మోహితులై వింటున్నారు. అతనిచేతిలో "రామ పాదసాగరం" నిర్మించిన తరువాత అది ఏవిధంగా ఉంటుందో వివరించే చిత్రమున్నది. ఒహో! అదొక అంతులేని మహా సాగరం! బ్రహ్మాండమైన వెడల్పున సాగిపోయే అచ్చపు తెలి వెన్నెల ప్రవాహం! ఎంతో ఎత్తునుంచి, ఏకముఖంగా ఒకే వరుసన పడుతూన్న ఒక అందాల జలపాతం! ఆ చిత్రాన్ని ఆయన ప్రజలకు చూపి, "దీనిని నేను నెహ్రూగారికి చూప గానే వారు, ఆహా! ఎంత అందమైన దృశ్యమిది! అని ఆయన నివ్వెరపోయారు. మరల, మరల ఈ దృశ్యాన్ని చూశారు. చూచి తప్పక ఇది నెరవేరేట్లు నేను చూస్తాను అని ఆయన వాగ్దానంచేశారు" అని ఆయన చెప్తూన్నమాటలు జగన్నాథం చెవిలో గింగురుమన్నాయి. జగన్నాథం కనులవెంట జలజల దుఃఖాశ్రువులు రాలాయి. అది నాటికీ నేటికీ ఏ మార్పూ లేకుండా అలాగే ఉండిపోయింది కదా అని అతను గుండె తరుక్కుపోయేట్లు ఏడ్చాడు. ఆనాడు తను ఎటువంటి కలలు గన్నాడు! ప్రపంచంలోని మహానదులన్నీ గోదావరికి జోహారు లర్పిస్తున్నట్లు, తన ఆంధ్రమాత సకల సంపదలతో తులతూగు తున్నట్టు స్వాప్నిక జగత్తులో విహరించాడు. కాని ఆ కలనేటికీ నిజంకాలేదు. మరి అదిఏనాటికి నిజమౌతుందో ఎవనిరికి తెలుసు?

లాంచీ పాపికొండల మధ్యకు వచ్చేప్పటికి, కలతజెందిన జగన్నాథం మనస్సు కొంత సుఖానపడింది. ఆకొండలమధ్య లాంచీ ఒక పెద్దసరస్సులో ఉన్నట్లుంది. ఊహల ఆకాశాలకు చేరువగా వెళ్ళినట్లు అతని ఆత్మ ఆ ప్రదేశంలో పరిపూర్ణమైన ఆనందాన్ననుభవించింది.

ఆ రాత్రి దుప్పట్లలో దూరిన యాత్రీకులు, మరునాడు తొమ్మిది గంటలవరకూ దుప్పట్లను వదలనే లేదు. యాత్రీకులు వంట చేసుకునేందుకు వీలుగా, ఆ వేళ లాంచీని ఓ తిప్పదరిని కట్టేశారు. అక్కడనుంచి యాత్రీకులలో కొంతమంది పుల్లల కోసం గట్టుమీదకు బయలుదేరారు. వాళ్ళతోబాటు జగన్నాథం, భాస్కరంకూడా బయలుదేరారు. వాళ్లు వెళ్లుతూండగా సరంగు "భాస్కరంగారూ....ఆట్టేదూరం పోకండోయ్ ఈ ప్రక్క పులులు తిరుగుతూఉంటాయి" అన్నాడు. జగన్నాథానికి వెంటనే వాళ్ళమ్మ జ్ఞాపకానికి వచ్చింది.

ఆ ఎత్తైనకొండలు, ఆ లోయలూ, వెదురు పొదలూ పెద్దపెద్ద టేకుచెట్లూ చూస్తూ ఉంటే ఎవరికైనా ఆనందం కలుగుతుంది. కాని భాస్కరానికి మాత్రం గుండెలు పీచుపీచుమంటున్నాయి. ఏమూలనుంచి పులివచ్చి మీదపడుతుందో అనేవాడికి భయంగా ఉంది.

జగన్నాథం ఒకచోట గభాలున ఆగిపోయి, "ఈకొండ ఎక్కుదాం రారా" అంటూ భాస్కరం కళ్లల్లోకి చూశాడు. ఆతనికళ్లు అందాలనిధి సన్నిధికి చేరుకున్నట్లు తళతళా మెరిశాయి. భాస్కరం ఒకసారి "అమ్మ బాబో....కొండే...." అన్నాడు.

భాస్కరానికి ఎలా నచ్చచెప్పాలో తోచక జగన్నాథం "వస్తేరా...... లేకపోతే మానెయ్, నాకేం; ఊతకాదని ఏడుస్తున్నట్లే ఆ తరువాత ఓ కొండేనా ఎక్కలేక పోయానని ఇహ రోజూ ఏడుస్తావ్" అంటూ ముందుకు గబగబా అడుగులు వేశాడు. పాపం భాస్కరం, జగన్నాథాన్ని అనుసరించక తప్పిందికాదు.

భాస్కరానికి పులులభయం అధికంగా ఉంది. పాపం అతని మనసు మానవులమధ్య ఉండటానికి తహతహలాడింది. అచ్చటి గాలి, ఒంటరితనంతో విసిగిపోతూ, ఆ చికాకు భరించలేక ఆ కొండలమీది చెట్ల జుట్టు నందుకొని ఒకఊపు ఊపుతూంది. దానితో ఆ చెట్లు భయంకరంగా ఏడుస్తున్నాయి. అక్కడనుంచి వాళ్ళకు లాంచీ కనిపించడమే లేదు. నదిని ఇసుక తిన్నెలు బలంగా అదిమి నొక్కేస్తూంటే అది సన్నబడిపోయి వంకరటింకరి గీతలా మారిపోయిందా అనిపిస్తోంది. ఆకసంలో ఏవేవో చక్కని పసుపురంగూ, నీలిరంగు పిట్టలు జతలు జతలుగా ఎగిరిపోతున్నాయి. ఎన్నో రకాల శబ్దాలు కొన్ని అతి సన్నగా కొన్ని గుబులుగుబులుగా భయంతో మూలుగుతున్నట్లు వినిపిస్తున్నాయి.

జగన్నాథం ఆ కొండ ఎక్కిపోతున్నాడు. భాస్కరం ఆ కొండ ఎక్కుతూ ఒకసారి వెనక్కి తిరిగిచూచి జగన్నాథాన్ని కొంచెం అయిష్టంతో అనుసరించాడు. ఆ కొండ మీదకు పోతూంటే రానురాను త్రోవ సన్నమై పోవడం మొదలుపెట్టింది. ఏవేవో పొదలు వారి చొక్కాలకు తగిలి "ఎక్కడకు వెళుతావ్.......నిలు...". అన్నట్టుగా వారి

నడుగడుగునా నిర్బంధిస్తున్నాయి. మధ్యమధ్య భాస్కరం ఇక పోదాం రారా.... నా కాళ్ళు లాగేస్తున్నాయి" అంటున్నాడు. "ఇంకెంత ... వచ్చేశాం" అంటూ జగన్నాధం ఉషారుగా ముందుకు సాగిపోతున్నాడు. భాస్కరం మరొకసారి వెనక్కి తిరిగి చూశాడు. వాడికి ఆ కొండమధ్య ప్రదేశానికి, తను ఎట్లా వచ్చిందీ అవగాహన కాలేదు. క్రింద చెట్లు ... పైన చెట్లు .... అంతా అయోమయంగా ఉంది. భాస్కరం గుండెలు పీచుపీచుమన్నాయి. ఒంటరిగా క్రిందకు వెళ్ళిపోవడానికీ భయ పడ్డాడు. జగన్నాధంతో మరి ముందుకు దూసుకపోవడానికీ అశక్తుడైపోయాడు. వాడికి పీకవరకూ దుఃఖము ముంచు కొచ్చింది. కొంతసేపయేటప్పటికి వాడికి జగన్నాధం కనిపించ లేదు. గట్టిగా "జగన్నాధం" అంటూ అరిచాడు. కాని జగన్నాధం దగ్గిరనుంచి ఆ కేకకు జవాబురాలేదు.

జగన్నాధం పైపైకి సాగిపోయాడు.

రానురాను అతనిగుండె బరువెక్కి పోతూన్నట్లుగా ఉంది. కాళ్ళను పట్టుకొని క్రిందికెవ్వరో లాగేస్తున్నట్టుగా ఉంది. నెత్తిమీదకు ఏవేవో పెద్దపెద్ద రాతిబండలు తిరుగబడుతూ న్నట్లుగా ఉంది. ఇంకొంచెం పైకి అధిగమించి, ఒక పెద్ద రాతిబండపైకి ప్రాకాడు. ప్రాకుతూ, ప్రాకుతూ చేయి జారి పోయినట్లయి, నిటారుగాఉన్న పెను నిచ్చెన కొసనుంచి తను రాలిపోతూన్నట్లు ఒక భయంకరమైన కేకపెట్టాడు. చప్పున ఆరాతి చపటామీద బల్లిలా, బొమ్మలా అంటుకపోయాడు. అతని తల పూర్తిగా దిమ్మెత్తిపోయింది. కొండమీద నిలిచి, చివరితళలో ఆ కొండపైకి ఎట్లావచ్చింది, చేసిన ప్రయత్నం

ఎట్లా ఫలించిందీ ఆతనికి గుర్తులేదు. అంతా ఒక కలలా జరిగిపోయింది అనుకున్నాడు. ఆకొండపైనఒక్కసారిగాగాలిపీల్చ లేకపోయాడు. ఊపిరితిత్తులలో ఆతనికి విపరీతమైన నొప్పిపుట్టింది. కాస్సేపాగి ఆ పైనుంచి చుట్టూ కలయజూశాడు. ఓహో! ఆతని ఆనందం మాటల కందదు! ప్రపంచం నడికొప్పున నిలిచి నట్లు, ధృవతారను చేరుకున్నట్లు, అద్భుతాలను సాధించిన క్షణంలోని మహా మేధావులైన శాస్త్రజ్ఞుల, ఊహాతీతమైన ఆనందానుభూతుల కొలమానపు తలమానికమైనట్టు--అయి పోయాడు.

ఆరాత్రి వాళ్ళు కేబిన్‌లో నిద్రపోవడానికి వీలు కలుగ లేదు. త్రోవలో ఎక్కిన ఒక ఆఫీసరు దాన్ని ఆక్రమించడం వల్ల వాళ్ళు లాంచీ పై భాగాన పడుకోవలసి వచ్చింది. లోపల చోటుచాలక ఇంకా కొంతమంది యాత్రీకులుకూడ లాంచీ పై భాగాన పడుకోవలసి వచ్చింది. లోపల చోటు చాలక ఇంకా కొంతమంది యాత్రీకులుకూడ లాంచీ పైకి వచ్చారు.

లాంచీ ఇంజను ఉన్న గదిలో ఒక పెట్రొమాక్సులైటు వెలుగుతూంది. దాని కాంతి నీళ్ళమీద పడుతూ లాంచీతో సాగిపోతూంది. కొండలూ, చెట్లూ అన్నీ ఒక్కటిగా కలిసి పోయి వెన్నెల్లో చలితో మూలుగుతున్నాయి. లాంచీ "ఉహు....ఉహు" అని గజగజ వణకుతో చలినుంచి తప్పించు కోడానికి ప్రయత్నిస్తూంది.

ఇంతలో ఆ లైటుకాంతిని ఏమనుకుందో ఏమో... సుమారు గజమున్నర పొడవున్న చేప ఒకటి ఆ దీపంమీదకు ఒక్క దుముకు దుముకింది. అది లాంచీలో పడగానే బాంబు

ప్రేలినంత శబ్దమయింది. అది వెండిలా తళతళ మెరిసిపోతూంది. దాని రెక్కలు, నోరుచూడ ముచ్చటగా ఉన్నాయి. దాని కనులమాయకంగా నల్లని చుక్కల్లా ఉన్నాయి. దాన్ని ఇద్దరు కళాసులు అదిమి చంపబోతూండగా జగన్నాథం, చంపవద్దని బ్రతిమాలబోయాడు. కాని అక్కడే ఉన్న గుమాస్తా మొగం చూడగానే అతనికలా చెప్పడానికి భయమేసింది. అయినా మెల్లగా "దానిని నీళ్ళల్లో వదిలేయండి. ఎంతందంగా ఉంది" అన్నాడు. ఈమాట వినగానే గుమాస్తా ఫక్కున నవ్వాడు. నవ్వి "పిచ్చివాడిలా ఉన్నావే...దొరికిన చేపను వదిలేస్తే, ఇంకో చేప ఎలా దొరుకుతుంది?" అన్నాడు. అతనికెలా నచ్చ జెప్పాలో జగన్నాథానికి తోచలేదు. ఒక జీవిని తను చేతులారా చంపేస్తున్నట్టె పూర్తిగా వికలమైపోయిన మనసుతో, లాంచీపైకి చేరుకున్నాడు.

లాంచీమీద రెండు రగ్గులు కప్పుకొని, చెవులకు మఫ్లరు చుట్టుకొని పడుకున్నా చలి గజగజ వణికించేస్తూంది. జగన్నాథానికి గిజగిజ తన్నుకుంటూన్న ఆ చేప జ్ఞాపకానికి వచ్చింది. ఆకసం మీంచి పడుతున్న వెన్నెల తెల్లగా మంచుకురుస్తూంది. లాంచీ మంచులో తడిసి ముద్దయిపోయి దాన్ని ముట్టుకుంటే జివ్వున లాగుతూంది.

లాంచీ ఆరాత్రి ఇసుకతిప్పల బారిపడకుండా అత్యంత జాగరూకతతో నడుపబడుతూంది. లాంచీలోని ప్రయాణీకులు, గాఢ నిద్రలో మునిగిపోయి ఉన్నారు. సరంగు కంఠం సీరసంగా పలుకుతూంది. డ్రైవరు ఓ కునుకుతీస్తున్నాడు. ఇంజను కుర్ర వాడు ఎర్రబారిన కళ్ళతో ఇంజనును కనిపెట్టుకొని, నిద్రను

జయించినవాడిలా ఉన్నాడు. భాస్కరం, జగన్నాధానికి ఒక ప్రక్క కాళ్ళూ చేతులూ తలా అన్నీ ఒక ఉండలా చుట్టుకొని పడుకున్నాడు. జగన్నాధం కొద్దిగా కదిలాడు. చలితో కాళ్ళు కూడదీసుకున్నాడు.

మిలమిల మెరిసిపోతున్న ఒక చేప నిద్రలో అతని కళ్ళముందు ఎగిరింది. దానికీ అతనికీ, చంద్రునికీ దానికీ మధ్య అన్నీ మబ్బులే. అది మబ్బుల్లోంచి ఎంతో వేగంతో ఎగిరి పోతూంది. జగన్నాథం గబాలున "చంద్రుణ్ణి మింగకు, చంద్రుణ్ణి మింగకు" అంటూ గిజగిజ తన్నుకొని ఆ నిద్రలోనె చేయి పైకిచాచి లేవబోయాడు. ఆ లేవడంలో ఆతని కళ్ళు తెరచుకున్నాయి. ఇదేమిటి! నేను మబ్బులమధ్య చంద్రుడికింత చేరువగా ఎలా ఉన్నాను?" అనుకున్నాడు.

ఆతని కతిసమీపములో చంద్రబింబం! ఆ మబ్బుల్ని తడివిచూడబోయాడు. చేతులకు చల్లగా అయింది. తను మెల్లగా ఏదోలిఫ్టుపై నుంచి క్రిందకు దిగిపోతున్నట్లయిపోయాడు. చల్లచల్లగా తారలజేడూ, మబ్బుకన్నెలూ దూరమౌతున్నట్లు గ్రహించాడు. లాంచీ ముందుకునడుస్తూన్నట్లు చూశాడు.

నక్షత్రమండలంలోని చంద్రునికింత సమీపానికి, ఇంత చులాగ్గా చేరుకున్న అనుభవాన్ని జన్మ జన్మలకూ మఱచి పోలేననుకున్నాడు. అతని మనస్సు ఎక్కడలేని ఆనందంతో ఉర్రూతలూగింది.

దట్టంగా పొగలాగ క్రమ్ముకున్న మంచు తెరల్లోంచి లాంచీ మరునాడు భద్రాచలం చేరుకుంది. గబగబా జగన్నాథం స్నానానికని నీటిలోకి దిగాడు. అక్కడి నీటి ఆగడానికి

అతను ఆశ్చర్య పోయాడు. ఆతని కాళ్ళక్రింద ఇసుక బొంగరా లాడుతూ చక్కలిగింతలు పెట్టింది.

జగన్నాధం, గుడిలో దేవుణ్ణీ, రామదాసు ఆ దేవునికి చేయించిన వస్తువుల పనితనాన్నీ తనివిదీరా చూశాడు. భాస్కరంతో కలిసి ఆ మరునాడు మరపురాని ఈ దివ్యాను భూతులను నెమరువేసుకుంటూ, ఇంటికి తిరిగి ప్రయాణం సాగించాడు.

## 5

భద్రాచలం వెళ్ళివచ్చినలగాయతు, జగన్నాధం ఒక విధంగా మారిపోయాడనే చెప్పాలి. అతని కనుక్షణమూ గోదావరీ, ఆ కొండలూ, ఆ పిట్టలూ, ఆ అడవిచెట్లూ, ఆ ఇసుకతిన్నెలూ, వెన్నెలలో మిలమిల మెరిసేనీరు, అమావాశ్య నాటి అర్ధరాత్రి నీళ్ళలో తళతళలాడే ఆచుక్కలతీరూ, అదే సమయాన నదిచేయు ఒక విధమైన సన్నని హోరూ—ఇవే.... ఇవే...అతనికి తలపుకొస్తూన్నాయి. అతనురోజూ ఏదో తిప్పద రికి ఈదుకొని పోతాడు. భాస్కరంతో కలిసి వేసవిలోగూడా రాత్రి వేళల స్నానంచేస్తూ ఉంటాడు. అయితే భాస్కరం మోకాళ్ళలోతు నీళ్ళలోనుంచి చస్తే ముందుకుపోడు. వాడు వడ్డునే నాలుగుమునుగులు మునిగి స్నానం అయిపోయిందని పించుకుంటాడు.

ఆవేళ బజారులో జనసంచారం హెచ్చుగా ఉంది. చీకటిపడేకొద్దీ కొట్లమీద దీపాలకాంతి హెచ్చుతూంది.

చల్లనిగాలి కాస్తహెచ్చుగానే వీస్తోంది. కుటుంబరావుగారు ఏవో బేరాలు చూచుకుంటున్నారు. తలవంచి ఏదోసరుకుతీసి ఎవ్వరికో ఇవ్వబోతుండగా ఆయన కెదురుగా జగన్నాథం నిలబడిఉన్నాడు. అతనిబట్టలన్నీ తడిసిపోయి ఉన్నాయి. తడిసిన వాటిని పిండి తిరిగి ఆరకుండగానే తొడిగినట్లున్నాయి. వాడి ఫాంటు కాళ్ళకు గోదావరి ఒండ్రుమట్టి అంటుకొనిఉంది. వాడితల తడిసిపోగా ఆదరబదరగా తుడిచినట్లు అల్లకల్లోలంగా ఉంది.

ఈ పరిస్థితిలో వాణ్ణి చూడగానే ఆయన ఓ తట్టాన ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆ తరువాత ఆయన అతి కష్టం మీద, "ఏమిటిరా... ఇది?" అన్నాడు.

జగన్నాథం ఏమీ చెప్పలేదు. అతని కళ్ళల్లో మానవాతీతమైన ఒక మధురాతిమధుర మందహాసం వెలిగింది.

"ఏమిటిరా....అలా వెర్రిగా నవ్వుతావు. ఏమిటది? అలా నానిపోయావేం...." అంటూ ఆయన జగన్నాథాన్ని తిరిగి ప్రశ్నించాడు.

జగన్నాథం ఏమీ చెప్పలేదు. కాని ఏదో చెప్పబోయి ఎలా చెప్పాలో తోచక తికమక లౌతూన్నట్లు అక్కడ అటూ ఇటూ కదిలాడు. కాంతివేగంతో మధురభావాల దొంతర్లు ఏవేవో ఆతని మొహంలో మెరిశాయి. కాని ఆతని కంఠధ్వని మాత్రం తనకున్న నైజగుణాన్ని ఉపసంహరించుకో లేకపోయింది!

చివరికతను ఎలాచెప్పాలో తెలియక కొట్టులోని అద్దం తీసుకొని, ఒక దువ్వెనతో తలదువ్వుకున్నాడు. దువ్వుకుంటూ,

పాపటమీద దృష్టి నిలిపి "అదికాదునాన్నా" అన్నాడు. వాళ్ళనాన్న కదేమిటో అర్థంకాలేదు. "ఏమిటిరా అది ...." అంటూ ఆయన వాడివైపు ఆశ్చర్యంగా చూశాడు.

జగన్నాథం, "కాదు నాన్నా ... మన భాస్కరంలేడూ వాడు ఇవ్వాళ నిజంగా చచ్చిపోను .... మేం తిప్పదగ్గరనుంచి తిరిగివస్తూ ఉండగా మా నావ తిరుగబడిపోయింది. నేను ఈదు కొని వాడ్ని ఒడ్డుకు లాక్కొచ్చాను." అన్నాడు.

కుటుంబరావుగారు జగన్నాథం మొగంలో ఏదో వెలుగు తూండటం చూశారు. ఆయన కాస్సేపలాగే మాటా మంతీ లేకుండా ఉండిపోయాడు. అతికష్టంమీద, "అయితే మీ అమ్మను కొన్నాళ్ళపాటు ఈ భూమ్మీద బ్రతుకనివ్వవా ఏమిటిరా...." అన్నాడాయన. ఆయన కంఠం అతి దీనంగా కంపించింది. పాపం జగన్నాథం ఏమీ మాట్లాడలేకపోయాడు.

ఈ దెబ్బతో కుటుంబరావుగారు ఇహకొడుకును జాగ్ర త్తగా కాపాడు కోవలసిన అవసరం ఎంతైనా ఉందనే అభి ప్రాయంలోకి పూర్తిగా వచ్చేశాడు. ఇంతకుముందల్లా భార్య ఎంత చెప్పుతున్నా త్రోసి పారేసేవాడు. కాని ఇహ ఆ విధంగా ఈ విషయంలో ఉండడంవల్ల ఏదో ఒక ఆపద రాకపోదనే భయం ఆయనలోనూ బలపడటం మొదలుపెట్టింది.

ఒకవిధంగా, ఆర్థికంగాకూడ ఆయన పరిస్థితి అంత మెరుగ్గా లేదు. మరొకవిధంగా ఆయనపైకి వృద్ధాప్యం ఒకటి మహాజోరుగా తరుముకుంటూ వస్తూంది. ఈవిషయం ఆయనకు తలపునకొచ్చే సరికి ఆయనగుండె గుభేలుమంది. జగన్నాథాన్ని మినహాయిస్తే ఇక తనకు బ్రతుకనేదేముంటో ఆయన ఊహించు

కోలేకపోయాడు. అది తలచుకుంటూ ఉంటూనే ఒళ్ళు ఝల్లు మాంటూంది. దానితో ఆయనకు నీటిగండంలో పుట్టిన కొడుకును, కాస్త నీటికి దూరంగా ఉంచక తప్పదనే భావం వేయి విధాలుగా సరియైనదని తట్టడం మొదలు పెట్టింది. ఇలాంటి భావాలంటే నిజానికాయనకంత సహించవు. కాని పరిస్థితులు చూస్తూ ఉంటే చేయిదాటిపోయే విధంగానే కని పిస్తున్నాయి. కాస్త యిప్పటినుంచీ కొంచెం కట్టుదిట్టం చేయక పోతే తాను ముందుముందు చాల యిక్కట్టులకు లోను కావలసి వస్తుందనే విషయం ఆయనకు సుస్పష్టంగా ఉన్నట్లని పించింది. బి. యస్‌సి. ఇంకొక సంవత్సరంతో జగన్నాథా నికి పూర్తయిపోతుంది. ఈ వేసవి సెలవుల్లో అతన్నిక్కడ ఉంచితే, అతను గోదావరికి పోకుండా ఉంటాడనే నమ్మకం ఆయనకెక్కడా కనబడలేదు.

ఏదో మిషపెట్టి, జగన్నాథాన్ని వాళ్ళ మామయ్యగా రింటికి ఈ సెలవుల్లో పంపడమే మంచిదని ఆయన ఓ నిశ్చ యానికొచ్చాడు. కాని ఇంతలోనే ఆయనకు మరొక మెరుపు లాంటి ఆలోచన తట్టింది. "జగన్నాథానికి పెళ్ళి చేసేస్తేనో ....”అనుకున్నాడు. కాని ఆయనకిది అంత సమంజసంగా కని పించలేదు. అభివృద్ధిలోనికి రావలసినవాడికి, ఇంత చిన్న వయ సులో పెళ్ళిచెయ్యడం—ఏమీ మంచిపద్ధతికాదని ఆ ఆలో చనను ఆయన ఆవలకు నెట్టేశాడు. ఏమిటో కాస్త గట్టిగా చెప్పి మందలిస్తే పోయేదానికి ఇన్ని ఆలోచన లెందుకూ...” అనికూడ అనుకున్నాడు. కాని జగన్నాథాన్ని చిన్నప్పటినుంచీ పెంచిన పద్ధతే వేరు. ఆయన అలా, వాడికేమీ చెప్పలేదు. పోనీ మెల్లగా తాపీగా అన్ని విషయాలూ వాడికి చెప్పిచూద్దా

మన్నా ...వా డివన్నీ విని నవ్వేసి పారేస్తాడు. వాడి స్వభావమే అంత! • "ఏమైనా ఈ సెలవుల్లో వాడ్నక్కడకు పంపడమే మంచిది" అంటూ ఆయన చివరకు నిర్ణయించుకున్నాడు.

## 6

జగన్నాథం కాస్త ఎదిగిన తరువాత వాళ్ళ మామయ్యగారి ఊరు ఎప్పుడూ వెళ్ళలేదు. వాళ్ళదసలు ఊబలంకదగ్గర ఓ పల్లెటూరు. అయితే వాళ్ళమామయ్య అక్కడ ఉన్న భూముల్ని అమ్మేసుకొని, అమలాపురంలో అత్తవారిచ్చిన భూములకు మరికొంత చేర్చి అక్కడే పూర్తిగా కాపురం పెట్టేశాడు. అప్పుడప్పుడు, జగన్నాథాన్ని వాళ్ళ మామయ్య ఆహ్వానించినా, లాంచీ ప్రయాణం చేయవలసి వస్తుందనే భయంతో వాళ్ళమ్మ ఏదో నెపంపెట్టి అప్పటికా ప్రయాణము ఆపుచేసేది. అయితే జగన్నాథంకూడా వాళ్ళ మామయ్యగారి ఊరంటే ఎందుకనో అంత పెద్ద ఆసక్తి కనబరచలేదు. దానికి సగం కారణం వాళ్ళ మామయ్య రాజమండ్రి కనీసం నెలకొకసారైనా వస్తూనే ఉండేవాడు. ఇహ ఉషా, వాళ్ళమ్మా అప్పుడప్పుడు ఇక్కడకు రావడం జరిగేది కూడాను.

జగన్నాథానికి బొబ్బర్లంక వెళ్ళేవరకు ఆ ఊరు పోవడాని కేమంత ఇష్టంలేదు. కాని బొబ్బర్లంక చేరినతరువాత అతనికా అభిప్రాయం మారిపోయింది.

బొబ్బర్లంకలో కాలుపెట్టినది లగాయితు కనిపించే

దృశ్యాలు, పులకించే గాలులు, తిలకించే కన్నులు ఒకరికొకరు పోటీపడ్డం మొదలుపెట్టాయి.

ఆ పచ్చని కొబ్బరాకులు, ఈ తెల్లని మబ్బుతునకలు, ఆ నల్లని ఆకాశపు నునుపులు అన్నీఎంతో ఆప్యాయంగా ఆతన్ని ఆహ్వానించాయి.

వాళ్ళమామగారి యిల్లు కొబ్బరిచెట్ల నడుమ పచ్చదనాల వెల్లువలా ఉంది. జగన్నాథం గుమ్మంలో, అడుగుపెట్టగానే ఉషలోనికి గబగబా పారిపోలేదుగాని, తరుముకొస్తూన్న నవ్వుల బారినుంచి తప్పించుకోవడానికా అన్నట్లు మొగం ప్రక్కకు త్రిప్పుకొని లోనికి కాస్త వేగంగానే వెళ్ళిపోయింది. జగన్నాథాన్ని వాళ్ళత్తయ్య ఎంతో ప్రేమతో ఆహ్వానించింది.

ఆ ఇల్లెంతో పరిశుభ్రంగా ఎక్కడ సామాన్లక్కడ పొందికగా అమర్చబడ్డ అందంతో స్వచ్ఛమైన వెలుతురుతో మనసుకెంతో హాయిగొల్పుతూంది. జగన్నాథం - కనిపించీ కనిపించకుండా మాయమైపోయిన ఉషాసుందరి నడకలు, ఆచిట్టి చేతుల బంగారుగాజుల మధురధ్వనులు, ఆ జడలోని మల్లె మొగ్గల తియ్యని పిలుపులు మనసులో ఒకసారి మననము చేసుకున్నాడు.

వాళ్ళత్తగారి పిలుపుమీద దొడ్డిలోకి స్నానానికి బయలుదేరిన జగన్నాథానికి, ఉష వంటగదిలో కనిపించింది. కూర్చొని బంగాళాదుంపల చెక్కుతీస్తూన్న ఆమె, అతని రాకతో గబాలున నిలబడకుండా ఉండలేకపోయింది. జగన్నాథానికి, "అరెరె...ఇది స్కూలుకాదు, మా యిల్లే" అనాలనిపించింది. కాని పాపం అలా అనలేక పోయాడు. ఆమె నిలిచి

ఉన్నవైపు ఇంకోసారిచూడా లనిపించినా, అటు మరి చూడ లేక పోయాడు.

నూతిదగ్గర స్నానంచేస్తూ వంటినిండా అలముకున్న సిగ్గుల దొంతర్లని పటాపంచలు చేయడానికా అన్నట్లు గబగబా ఒడలు రుద్దేసుకున్నాడు. కాని అవి ఎంతకీ అంతంకావడమే లేదు. ఇంతలో "ఇదిగోదావరి కాదండోయ్...కాస్త తెమ లాలి..." అన్నమాటలు ఆతని చెవికి ఆ స్నానాల సంరంభంలో సన్నగా వినిపించాయి. అవి కొబ్బరాకులనుంచి జారిపడే సూర్యకిరణాల్లా అతిచురుగ్గా అతన్ని ముట్టడించాయి. "ఎక్కడ నుంచి చెప్మా" అంటూ జగన్నాథం చుట్టూ పరికించాడు. ఉష ఎక్కడా కనిపించలేదు. వెంటనే అతను ఏదోగట్టిగా అనేయాలనుకున్నాడు. కాని ఏమీ అనలేకపోయాడు. అతని కంటిముందు అఖండగోదావరీ ప్రవాహమూ, ఆ చల్లని ఇసుక తిన్నెల సుఖం, మెత్తని స్వభావమూ, ఆ నవనీతపు నీలికొండల దృశ్య సమూహమూ అవతరించాయి. ఆ తరువాత ఉషా, ఈ చిన్నయ్యా, కనిపించాయి.

"భోజనం చేద్దువుగాని రా బాబూ..." అన్న పిలుపు విన్న జగన్నాథం, "మామయ్యా వచ్చిన తరువాత తింటాలే అత్తయ్యా" అన్నాడు. ఈ జవాబుకు సమాధానంగా లోపలి నుంచి ఉషకల్పించుకొని, "నాన్న అప్పుడే రారు మామయ్యా" అంది. జగన్నాథం ఇహ ఈ అవకాశం పోతే దొరకదేమో అన్నంత ఇదిగా, "మరి నేను ఒంటరిగా తినలేనే...ఈ లోటు ఎవరు భర్తీచేస్తారు" అన్నాడు. ఉష ఈసారి అతను ఉన్న గదిలోకి వచ్చేసి, "అబద్ధాలుకూడా వచ్చన్నమాట" అంది.

జగన్నాథం ఒక్కసారిగా తబ్బిబ్బైపోయాడు. అయినా నిలద్రొక్కుకొని, "అవి నేర్చుకోడానికేగా నే నిక్కడికొస్తా...." అన్నాడు.

ఈసారి ఉమ "అబ్బా!...." అంటూ లోనికి తుర్రున పారిపోయింది.

# 7

జగన్నాథం మూడురోజులపాటు కోనసీమ అంతా తిరిగి, గోదావరీదేవి సమగ్రస్వరూపాన్ని ఆకళింపు చేసుకున్నాడు. వైనతేయ, వసిష్ఠ, గౌతమీ పాయలలో స్నానం చేశాడు. నరసాపురం, గన్నవరం, కోటిపల్లి క్షేత్రాలుతిరిగి చూశాడు. గన్నవరంవద్ద అక్విడక్టు అతని మనసులో ఏవేవో ఊహాలను రేకెత్తించింది. వెంటనే అతనికి "రామపాద సాగరు" గుర్తుకొచ్చింది. అంతే!......హృదయాకాశంలో మబ్బులు ఏవో గాఢంగా అల్లుకున్నాయి.

అమలాపురాన మొదట్లో రెండురోజులుకూడ ఉండలేననుకున్న జగన్నాథం ఇప్పుడంత పట్టింపుగా లేడు. కాని గోదావరిమాత్రం, ఆతన్ని ఎక్కడా విడిచిపెట్టడంలేదు. మంచినీళ్లు త్రాగేటప్పుడు, స్నానాలు చేసేటప్పుడు, ఆతనికి గుర్తువచ్చి, ఆ నదీమతల్లి, ఏదో పర్వతాలనుంచి చేయి ఊపి మెల్లగా, సన్నగా, పిలుస్తూన్నట్లుగానే ఉంటూంది.

ఓ రోజున చల్లనిగాలి వీస్తూన్న సాయం సమయంవేళ, దొడ్డిలో పచ్చగడ్డిమీద ఓ కొబ్బరిచెట్టుకు చేరబడి కూర్చున్న

జగన్నాథం చదువుతూన్న పుస్తకాన్ని మూసి, నూతి వద్ద నీళ్లు తోడుకుంటూన్న ఉషను, "ఇదిగో ఉషా..." అని పిలిచాడు.

ఉష చేస్తూన్న పని నలాగే విడిచిపెట్టి వెక్కిరింపు తొణికిసలాడే ఒయ్యారంతో "ఏమండీః" అంటూ ఆతనికి దగ్గరగా వచ్చింది.

జగన్నాథం ఏమీ మాట్లాడలేదు. కాని ఆమె వైపు అలాచూస్తూ చిత్తరువులా ఉండిపోయాడు. ఉష "అరే... తమరికంఠం మూగవోయిందే?" అంది.

జగన్నాథం తేరుకొని, "సాక్షాత్తూ జలదేవత వచ్చి ముందునిలిస్తే కంఠమేమిటి, సమస్తమూ మూగవోతుంది" అన్నాడు.

"ఓః....అయితే నీటిలో పుట్టినవాళ్ళ కందరూ ఆలాగే కనిపిస్తారు కాబోలు" అంది ఉష.

జగన్నాథం "అయితే...నీకూ తెలుసన్నమాట!" అన్నాడు.

ఉష ఉల్లాంసంగా, "ప్రాణదాతలు! తమరి చరిత్ర ఆమూలాగ్రంగా వంటబట్టించుకోకపోతే ఎలా...?" అంది.

వెంటనే జగన్నాథం "అదేమిటేః...." అన్నాడు.

ఉష "అబ్బే...ఏమీలేదు" అంది.

జగన్నాథం చురుగ్గా "ఏమీలేదంటే ఏదోఉందనే అర్థము..." అన్నాడు.

ఉష తగ్గిపోకుండా "అది తెలిసినవారు తెలియనట్టు నటిస్తున్నారనే దానితాత్పర్యం" అంది.

జగన్నాథాని కేమి చెప్పడానికీ తోచలేదు. కాని వెంటనే...." ఇదిగో ఉషా....నువ్వు తప్పక పరీక్ష ప్యాసవు తావు" అన్నాడు.

ఉష "నేను డింకీ కొట్టడం తమరికి కొంచెం ఇష్టంలా ఉందే...." అంది.

జగన్నాథం నవ్వు కన్నులలోంచి చిమ్మింది. అతను "నువ్వుడింకీ అంటే నాకో చేప సంగతి జ్ఞాపకానికి వస్తూంది." అన్నాడు.

ఉష "చే పేమిటి? చేప?" అంది.

జగన్నాథం "అదే....అనగనగా ఓ పెద్ద చేపలే....అది ఓరాత్రి లాంచీలో వెలుగుతూన్న దీపాన్ని మింగెయ్యాలని తపీమని ఆ లాంచీలో కెగిరింది. ఇంకేముంది ఆదెబ్బతో దానికీ నీటికీ ఋణం తీరిపోయింది" అన్నాడు.

"అరరే....పాపం...." అంది ఉష.

"పాపమే మరి...." అన్నాడు జగన్నాథం.

"అంచేత లాంచీలో పుట్టినవాళ్లు కాస్తనీటికి దూరంగా ఉండడం మంచిదేమో...." అంది ఉష కిలకిల నవ్వుతూ.

ఆ మాట జగన్నాథం గుండెలో శూలంలా గ్రుచ్చు కుంది. కాని ఆతడు తమాయించుకొని, "మంచిదేమరి....కాని నువ్వింతదూరంగా ఉంటే నేను పడకుండా ఎలాఉంటాను?

కాస్త ఆ చీరచెంగైనా అందితే అది పుచ్చుకొని పైకి తేల్తాను" అన్నాడు.

ఉష "మామయ్యగారి తెలివి చాలదూరం వెళ్ళిందే ...." అంది.

జగన్నాథం కొంచెం ఉడుకు బోతుతనంగా " మా తెలివికేంలే....కోనసీమ గోదావరీదేవి మెదడుగా....అంచేత మీారే మెదడున్నవాళ్ళు...." అన్నాడు.

"అయితే మెదడులేని వాళ్ళుకూడ ఉంటారేమిటి మామయ్యా" అంటూ ఉష కళ్ళల్లో చిరునవ్వు, సంగీతంలా ఆలాపిస్తూ గమ్మున ఇంటిలోకి పారిపోయింది.

జగన్నాథం ఉష వెనుక పరుగెత్తలేదు. ఆమె అలా వెళ్తూంటే నాజూకైన సెలయేరొకటి సీలమండల్ని తడుపుతూ, మధ్యమధ్య అడ్డువచ్చే రాళ్ళల్లోని లోలోపలి హృదయాలను తట్టిలేపుతూ కిలకిల సాగిపోతూన్నట్లే ఊహించుకొన్నాడు. ఆమె నలాగే చూస్తూ ఆత నక్కడే నిలుచుండిపోయాడు.

ఆరాత్రి అతనికి నిద్రపట్టలేదు. ఉష మాట్లాడిన మాటలు అతని తలలో అలలుగా కదిలిపోవడం మొదలు పెట్టాయి. అవి కొద్దిగా బాధకలిగించినా, వాటి నునుమెత్తని తాకిడి ఆతని మనస్సు నుయ్యాలలో ఊపింది. ఆ ఊయల కాస్సేపటికి గోదావరీ కెరటాలపై తేలి ఆపైన, తీయగా కదలిపోయే గాలి పాటల్ని ఆతని చెవిని వేసింది. జగన్నాథం కళ్ళముందు గోదావరి నిలిచి గలగలా ధ్వనుల అలల చేయి ఊపి పిలిచింది. గుండెలోతుల్లోని సంగీతపు పొరల్లోంచి తీయగా గళమెత్తి కేక వేసింది.

ఒక్కసారి జగన్నాథానికి అమలాపురంనుంచి కదిలి రాజమండ్రి వెళ్ళిరావాలనిపించింది. "ఇక్కడనుంచి వెళ్ళిన.తరువాత మళ్ళీ ఎలా తిరిగి వస్తావ్ జగన్నాథం" అని అతనిగుండె ప్రశ్నించింది. "ఉష ఎంత బాధపడుతుంది" అని ఏదో చెప్పబోయింది. కాని జగన్నాథం "ఎందుకమ్మా...పాపం బాధ..." అంటూ నవ్వుకున్నాడు. "ఇప్పుడు వెళ్ళడమే మంచిది" అంటూ నిర్ణయించుకున్నాడు.

ఆ మరునాడుదయాన్నే జగన్నాథం వాళ్ళ మామయ్యతో "ఇవ్వాళ రాజమండ్రి వెళ్తాను మామయ్యా" అన్నాడు. ఈమాటవిన్న ఉష ఉలిక్కిపడింది.

"మీ అమ్మమీద దీవేసిందేమిటిరా..." అని వాళ్ళ మామయ్య గట్టిగా నవ్వాడు.

జగన్నాథం కొద్దిగా నవ్వి "మా అమ్మమీద కాదు కాని, అక్కడ ఇంకో అమ్మ ఉంది. ఆ అమ్మకు నేనొక్క క్షణం కనిపించకపోతే ఏమీతోచదు" అన్నాడు.

ఈ మాటలతో వాళ్ళమామయ్య మొగం ముడతపడింది. మాట తడబడింది. కంఠం కొద్దిగా జీరవోయింది. పాపం ఆయన "ఏమిటిరా నువ్వనేది?" అన్నాడెలాగో.

జగన్నాథం "నాకిక్కడ ఏమీ తోచడంలేదు మామయ్యా" అన్నాడు.

ఈ మాటవిన్న ఉష, గేలం ముల్లుగుచ్చుకున్న చేపలా గిజగిజా కొట్టుకుంది.

"ఔను! ఈ పల్లెటూళ్ళో ఆ పట్నం దొరలకేమి తోస్తుంది" అంది. కోపం బాధ కలగలపుకొని వచ్చిన ఆమాట ఉష కళ్ళల్లో కన్నీటి చుక్కల్ని నింపింది.

జగన్నాథం "అదికాదు ఉషా... నాకూ ఇక్కడ ఉండాలనే ఉంది. కాని రాత్రినుంచీ మనస్సేమిటో ఒకటే పీకుతూంది. ఏమిటో అర్థంకాదు. రాజమండ్రి ఒక్కసారి వెళ్లాలనిపిస్తూంది" అన్నాడు.

వెంటనే వాళ్ళ మామయ్య "ఏమిటిరా ఆమాటలు... నీకేమైనా పిచ్చెక్కిందా...." అన్నాడు.

జగన్నాథం "అదికాదు మామయ్యా..." అంటూ ఏమిటో చెప్పబోతూవుంటే ...అతని ఎదుట నిలిచిన ఉష కళ్ళల్లో నిలిచిన నీళ్ళు, చెంపలమీదకు జారుతూండగా లోనికి గబగబా వెళ్ళిపోయింది.

ఇంతలో వాళ్ళ మామయ్య, "మరేం ఫరవాలేదులే.... వెళ్దువుగానిలే .." అంటూ అరుగు దిగిపోయాడు.

జగన్నాథం ఏదో చెప్పడానికా అన్నట్టు నోరు విప్పబోయాడు. వెంటనే వాళ్ళ మామయ్య ఎర్రగా అతనివైపు చూసి "ఏమిటి నువ్విప్పు డక్కడకు వెళ్ళి చేసేది....ఆ గోదావరిలోపడి మా పీకలమీదకు తేడానికేనా...తిన్నగా ఉండు. వెధవ వేషాలెయ్యక" అనేసి ఆయన వీధిలోకి పోయాడు.

జగన్నాథానికి చప్పున వాళ్ళనాన్న గుర్తుకొచ్చాడు. "ఇదంతా నాన్న చేసినపనే....నాన్న చేసినపనే." అనుకున్నాడు. "ఇందుకనా...ఎప్పుడూ వెళ్ళమనంది, ఇప్పుడు అమ్మకూడా

వెళ్ళమని చెప్పింది" అనుకున్నాడు. ఒక్కసారిగా అతనికి తల కొట్టివేసినట్లయింది. అతనిగుండె భగ్గున మండింది. ఇంక ఇక్కడ ఒక్కక్షణంకూడ ఉండకూడదని వెంటనే నిశ్చయించుకున్నాడు. గబగబా లోనికిపోయి బట్టలూ వగైరా సర్దుకోవడం మొదలు పెట్టాడు. వాళ్ళత్తయ్య అక్కడకువచ్చి "ఇదేమిటి జగన్నాధం! మామయ్య ఏదో అంటే నువ్విలా వెళ్ళిపోవడం ఏమీ బాగుండలేదు.

ఇంతకీ ఆయన ఏమన్నారని? అసలాయన మాట తీరే అంత. ఇంతకీ నువ్వాయనకు చెప్పకుండా వెళ్ళడం ఏమీ బాగు లేదు" అంది.

జగన్నాధం ఆమెతో ఏమీ మాట్లాడలేదు. తన పనిలో తాను మునిగిపోయాడు.

ఉష అక్కడకు మెల్లగావచ్చి "అయితే ఇక ఉండవాం మామయ్యాం...." అంది. ఆమె కంఠం వేయి పాశాలతో బంధించేస్తున్నట్లుగా అతనికి తోచింది. కాని అతను లొంగిపో లేదు. "ఇది మరీ బాగుంది. మామయ్య ఏదో అన్నాడని నేను వెళ్ళిపోతున్నానేమిటి? మామూలుగా నేను వెళ్ళిపోవాలను కున్నాను; వెళ్ళిపోతున్నాను...అంతే...." అన్నాడు; లేనినవ్వు మొగంమీదికి అతి కష్టంమీద ఈడ్చుకొచ్చి, ఒక మోస్తరుగా నచ్చచెప్పే ధోరణిలో —

ఉష ఎంతో బాధతో "పోనీ రేపు వెళ్ళు మామయ్యా" అంది.

జగన్నాధం "ఇవ్వాల్టికీ రేపటికీ తేడా ఏమిటి?" అన్నాడు.

"ఉంది మామయ్యా, చీకటికీ వెలుతురుకీ వున్నంత తేడా వుంది...నువ్వి చీకటిలో వెళ్ళిపోతాననడం ఏమీ బాగుండలేదు" అంది.

జగన్నాథం ఉషవైపు నిదానంగా చూశాడు. ఆమె చూపుల్లోంచి ఉబుకుతూన్న ప్రార్థనల్ని త్రోసిపుచ్చడం అతనికి చాల కష్ట మనిపించింది. అయినా "కాని, ఉషా...ఈసారికి నన్ను పోనియ్" అన్నాడు. ఈ మాటలు కంఠంలోంచి రావడం కొంచెం కష్టమే అయింది.

పాపం ఉష "ఇంత నిర్దయుడ వనుకోలేదు మామయ్యా" అంది. పాపమామె ఇంకా ఏమో చెప్పబోయింది. కాని ఆమె లోంచి పొంగి పొర్లుకొని వస్తూన్న దుఃఖాన్ని అణచుకోనే శక్తి లేక లోనికి గబగబా వెళ్ళిపోయింది.

జగన్నాథం సర్దుతూన్న సామానువైపు ఒకసారిచూసి, లోనికి వెళ్ళిపోయిన ఉషవైపు మరొకసారి చూచి అలాగే మాటా మంతీ లేకుండా నిలబడి పోయాడు. కాని ఇంతలో అతని చెవిలో అతని మామయ్య అన్నమాటలు ధ్వనించాయి.

"...ఆ గోదావరిలోపడి, మాపీకలమీదకు తేవడానికా.... తిన్నగా ఉండు వెధవ వేషాలు వెయ్యక...." అన్న మాటలు ఒక్క సారిగా అతని పైకి విజృంభిచాయి. "వెధవ వేషాలు వెయ్యక" అన్నమాట ఒకసారి నాలుకమీదకు తెచ్చుకున్నాడు. అంతే....వస్తా నత్తయ్యా....అంటూ వీధిలోకి వచ్చేశాడు. ఉషకోసం అతని కటూ ఇటూ వెదకాలనిపించింది. కాని తలను ఏ ప్రక్కకూ త్రిప్పకుండా బయటకు లాక్కొచ్చేశాడు. వాళ్ళత్త మరోసారి "జగన్నాథం....నామాట విను అంది.

కాని అతను, ఎరువు తెచ్చుకున్న నవ్వుతో "మళ్ళీ ఇంకెప్పుడైనా వస్తాలే అత్తయ్యా...." అంటూ సాగిపోయాడు.

## 8

విశాలమైన మెత్తని హృదయంలా ఉన్న ఆ నదీమ తల్లిని చూడగానే, జగన్నాథం గుండె ఉత్సాహంతో ఉప్పొంగి పోయింది. ఎక్కడెక్కడో చిక్కుకొనిపోయిన ప్రాణా లన్నీ ఎగిరివచ్చి, అతని లోనికి చేరినట్లయింది. కాని ఉష అన్న మాట మాత్రం అతని గుండెల్లో ఒక మూల ముల్లులా గ్రుచ్చుకుంటూనే ఉంది.

ఇంటిదగ్గర, ఈసారి జగన్నాథం అనుకున్నట్లుగానే, వాళ్ళ అమ్మ ఒక్కర్తే కాకుండా కుటుంబరావుగారు కూడ ఆమెతో కలిసి అతన్ని సాధించాడు. తండ్రికికూడ ఈపిచ్చి ఎలా అంకురించిందో పాపం జగన్నాథం ఊహించలేకపోయాడు. ఒక్కసారి పెదవి విరిచి "పిచ్చివాళ్ళు!" అనుకున్నాడు.

ఇక్కడకు వచ్చిన దగ్గరనుంచీ జగన్నాథం మనసు, ఉష ఉన్న చోటికి అనుక్షణమూ ఎగిరి పోతూనే ఉంది.

జగన్నాథం తనను అపార్థం చేసుకోవద్దని ఎంతో బాధ తో ఆమెకు నచ్చజెప్పబోతాడు. కాని ఆమె "నేనంటే నీకసలు ఏమాత్రం ఇష్టం లేదు మామయ్యా....అందుకనే వచ్చేశావు.... అంతే కదూ...."అంటుంది. నువ్వు పిచ్చిదానవు ఉషా" అంటూ, జగన్నాథం పాపం! తన పిచ్చిలోకపు నవ్వొకటి నవ్వుతాడు.

ఆమె స్కూల్ ఫైనలు ప్యాసయినట్లు వాళ్ళ మామయ్య వ్రాసిన ఉత్తరం ఓరోజున వచ్చింది. ఉష ఈ సంగతి తనకు వ్రాయనందుకు జగన్నాధానికెందుకనో కొద్దిగా కోపం వచ్చింది. కాని ఉష కెప్పుడూ లేని అలవాటు ఇప్పుడు కొత్తగా ఎక్కడనుంచి వస్తుంది అనుకున్నాడు. పోనీ తనే ఒక ఉత్తరం వ్రాస్తే...అతని కలా వ్రాయా లనిపించింది. ముక్తసరిగా మూడు మాటలు వ్రాసి అమెకు పోస్టు చెయ్యబోయాడు. కాని తపాలాపెట్టె మొగం చూడకముందే అది చిరిగిపోయింది. రోజులు మెల్లగా గడుస్తున్నాయి. వేసవి జోరుగా తన మగతనం చూపిస్తూంది.

ఒక రాత్రి వెన్నెల్లో ఆరుబైట మంచంమీద పడుకున్న జగన్నాధం, చుక్కలవైపూ, చంద్రుడివైపూ అలా చూస్తూ ఆలోచించుకుంటున్నాడు.

తెల్లని మల్లెపూ వెన్నెల్ని తమ శిరస్సున ధరించి, అంత కన్నా తెల్లని మబ్బుకన్నెలు, నభోవీధిని నాట్యమాడుతూ, మెల్లిమెల్లిగా తరలిపోతున్నాయి. చిన్నారి చుక్కలు, తమ చిరునవ్వులే కన్నులుగా చిట్టిమబ్బుల నృత్యభంగిమల్ని ముచ్చటగా వీక్షిస్తున్నాయి.

ఆ మబ్బులకు పైపైన, చందమామకు ముందు, చుక్కలకు చేరువగా, ఉష—నల్లని ముసుగు కప్పుకొని, కడుపు తరుక్కుపోయేట్లు దుఃఖిస్తూ, "ఆనందం పొంగిపొరలి పోతూన్న ఈ విశాల వియత్పథాన దుఃఖిత వదనను నేనే మామయ్యా!" అంది. జగన్నాధం గుండెలో ఎవరో శూలం గ్రుచ్చినట్లయింది. అతని కింక ఆ ప్రదేశంలో నిద్రపో బుద్ధి పుట్టలేదు. అంతే .... మంచం మీద మరి అతను కనిపించలేదు.

అరుగుమీద నిద్రపోతూన్న జగన్నాథం తల్లి, విసనకర్రను అందుకోబోయి అది చేతికి దొరకగపోగా, దానికోసం ఆమె పైకి లేచింది. లేవగానే వెన్నెల్లో ఖాళీగా పడి ఉన్న ఆ మడత మంచం వైపు చూసింది. ఇంకేముంది...ఆమె గుండె ఆగిపోయేంతగా, కళ్ళు ఆ మంచంమీద ఆలాగే వదిలేసి, "జగన్నాంథం" అంటూ గట్టిగా కేక వేసింది. ఆ కేకతో కుటుంబరావుగారు " ఏమిటేమిటి " అంటూ కంగారుగా లేచారు. పరిస్థితి ఆ మడతమంచం ఆయనకూ నివేదించింది.

"అరే! ఎక్కడికి పోయాడు వీడు. సినిమాకు వెళ్ళాడేమో" అంటూ తిరిగి పడుకోబోయాడు. కాని ఆమె జగన్నాథాన్ని పదిగంటలకు ఆ మంచంమీద చూచినట్లు చెప్పింది. జగన్నాథం ఎక్కడికి వెళ్ళిపోయాడో ఇద్దరికీ అంతుపట్టలేదు. మంచంమీద వెన్నెల్లో చికాగ్గా పడి ఉన్న ఆ దుప్పటి, "నాకూ చెప్పలేదు, మరి ఎక్కడకి వెళ్ళిపోయాడో" అంటూ బద్ధకంగా ఓసారి అటూ ఇటూ కదిలింది.

పక్కింటి మాష్టరుగారు "ఏమి జరిగిందండీ, ఏమిటి.... ఎవ్వరికైనా తేలుకుట్టిందా" అంటూ కంగారుగా అడిగాడు. కుటుంబరావుగారు భార్యను కాస్త గట్టిగానే మందలించి, "అబ్బే, ఏమీలేదండీ మావాడు మంచంమీద లేకపోతే....ఈ పిచ్చిదేమిటో కాస్తభయపడింది" అనేసి ఆయన అక్కడకు వచ్చిన మాష్టరుగారిని ఆమంచం మీద కూర్చోమన్నాడు.

అసలే సగం సగంగా నిద్రపడుతూందేమో, కాస్త మాట్లాడి అలసిపోతే పూర్తిగా నిద్రపట్టేభాన్ను లభిస్తుందేమో

అన్న భ్రాంతితో సినిమాకు వెళ్ళాడేమోనండి" అంటూ కుటుంబరావుగారితో ఆ మాష్టారు మాటల కుపక్రమించాడు.

కుటుంబరావుగారు, "అబ్బే లేదండీ. పదింటికి వాడిక్కడే ఉన్నాడండీ. ఏమిటో వీణ్ణి పట్టుకోవడం మాతరం కాకుండా ఉంది. వెధవ, అక్కడికే వెళ్ళి ఉంటాడు. ఈ అలవాటునుంచి ఎలా తప్పించాలో నాకేమీ తోచటంలేదు" అన్నాడాయన.

ఆ మాష్టరుగారు, "అరే ఈ అర్థరాత్రి అక్కడికే వెళ్ళాడంటారా. ఎంత గుండెనిబ్బరం! ఏమిటో, వాడికి ఈ, యీతల మమకారం! అర్ధరాత్రి ఇదేం బుద్ధి! కాని మీవాడు చాలామంచివాడండీ చందమామలాంటి వాడు. చంద్రుడికైతే మచ్చ ఉందికాని అతని నుంచి వెలువడే ఆ వెన్నెలకేం మచ్చ ఉందండీ. ఏమిటో చదువులో వెనకబడివున్నాడా అంటే, మొదటి మార్కులన్నీ వాడివేగా! వాడిలో ఏదో, మహత్తరమైన శక్తి పనిచేస్తూన్నదండీ" అంటూ ఆయన ఆగిపోయాడు.

కుటుంబరావుగారు ఆయనవైపు అలాగేచూస్తూ, ఏమిటో మీరు చాలాదూరం చెప్పేశారు. మాకు వాడేకదండి దిక్కు. రోజులుచూస్తే ఏమీ బాగులేవు. ఏరోజున ఏమౌస్తుందో చెప్పలేం. మేం వాణ్ణి కాస్తజాగ్రత్తగా కాపాడుకోకపోతే-ఇంక మాకు అధారం మేముందండీ" అంటూ దుఖాన్ని అతి కష్టంమీద ఆపుకున్నాడు.

ఆ మాష్టరుగారు, అవును మరి. మీరు చెప్పిందీ నిజమే! మనలాంటి పేదవాళ్ళకు ఈ పిల్లలేగా మరి ఇన్స్యూరెన్సు పాలసీలు! కాని మీవాణ్ణిగురించి భయపడనక్కర్లేదండి.

కాంతమ్మగారూ, మీరు హాయిగా నిద్రపొండి. తెల్లవారేప్పటికి మీవాడు మీఇంటిదగ్గర ఉంటాడు. ఏమిటో మీవాణ్ణి చూస్తూఉంటే ఈలోకంలో తప్పబుట్టినవాడిలా కన్పిస్తాడు. మీరేం దిగులుపడకండీ మీకంతగా వాడు కష్టం గలిగిస్తున్నాడంటే పోనీ వాణ్ణి మాకిచ్చేయండి. మేం పెంచుకుంటాం” అన్నాడు నవ్వుతూ.

ఈ మాటతో కుటుంబరావుగారు చిన్న నవ్వు నవ్వి, “ఈమాట మీరు ఇంతకుపూర్వం అని ఉంటే మాకందు కేమీ అభ్యంతరం లేక పోయేది. కాని ఇంకెన్నాళ్ళులెండి....మీరు”

ఆ మాష్టరుగారుకూడా అలాగే నవ్వి, “అయితే ఈ సంగతి మీదాకా వచ్చిందండీ... ఏమిటో ముసలకాలంలో పిల్లలు! వాళ్ళు పెద్దవాళ్ళయ్యేప్పటికి మనముంటామో ఊడతామో” అంటూ ఆయన ఎంతో బాధపడ్డాడు. మెల్లగా కుటుంబరావుగారు “ఏమిటో పిల్లలు! ఉంటే ఒకబాధ, ఉండక పోతే ఒకబాధ. అంతా మున్నాళ్ళముచ్చట!” అన్నారు దిగాలుగా.

ఆ మాష్టగారు “అంతేనండి, అంతే. మూణ్నాళ్ళ ముచ్చటే!” అని నిట్టూరుస్తూ అక్కడే జగన్నాధం ఖాళీచేసిన మంచంమీద పడుకున్నాడు. జగన్నాధం ఆ వెన్నెల్లో ఈదుకుంటూ తిప్పదగ్గిరకు వెళ్ళిపోయాడు. వెన్నెల పాన్పులా ఉన్న ఆ తిప్ప సమస్తాన్నీ మరపింపజేస్తూంది. ఒక జలకణం గుండెలోతుల్లోంచి చంద్రకిరణం ఒకటి ఫక్కున నవ్వింది. జగన్నాధానికి ఉష తనప్రక్కనఉంటే ఎంతో బాగుండుననిపించింది. ఆమెతో కలిసి ఆతనికి మద్రాసులో చదవాలనిపించింది. బి. యస్‌సి.

అయిపోగానే తప్పక తిరిగి ఇంజనీరింగు కోర్సు చదవాలని, ఇంజనీర్లుగా ఎంతో అభివృద్ధిలోనికి రావాలని అతను కోరుకు న్నాడు. అప్పుడే ఆతని కళ్ళముందు అఖండ గోదావరిరూపము దాల్చి నిలిచినట్లయింది. ఆమె తన ఎదలోని కోరికగా అలల పెదవివిప్పి ఆతని మది కేమేమో చెప్పింది. ఆ తల్లి బాధ జగ న్నాథాని కవగాహన అయింది. ఆతను ఏమేమో ఆలోచిం చాడు. ఏదేదో చెయ్యాలనుకున్నాడు. అతనా ఊహాలలోబడి ఎంతదూరమో వెళ్ళిపోయాడు.

ఆ ఊహల్లో కార్తీకమాసపు తెల్లవారుఝాము వెన్నె లలో ఆ చలిలో ఎందరో స్త్రీలు భక్తితో వెలిగించివదిలిన అరటిదొప్పలలోని దీపాలు హంసల్లా మందగమనంతో గోదా వరినిండా వెలుగుల్ని వెదజల్లుతూ ప్రవాహం వెంబడి వెళ్ళి పోతున్నాయి. ఆకసంలోని చుక్కలన్నీ భువికిదిగి ఆ దొప్పల్లో- దీపాలుగా మారిపోయాయి. ఆ దీపాలను జగన్నాథం ఒక్క టొక్కటిగాతీసుకొని నీటిఅట్టడుగునుంచి, ఇంకాఇంకా లోతుకు త్రవ్విన పునాదుల్లోనుంచి పేర్చుకొని నది ఎంత వెడల్పున్నదో అంత వెడల్పున ఆ పైన హిమాలయాల ఎత్తున దేదీప్యమైన దీపాల అనకట్టను నిర్మించాడు. ఓహో ఏమిదీపాలవి ! నీట తడిసి ఆరిపోవు ! గాలితగిలి అంతమైపోవు ! అబ్బ ! ఎంత కాంతి ! ఎంతకాంతి ! మానవాళికి సుఖశాంతుల నిచ్చే ఆ కాంతి నిజముగా నిత్యసంక్రాంతి !

•జగన్నాథం ఆ వెలుతురు బాటమీద, ఉప్పొంగిపో తూన్న ఉత్సాహంతో పరుగులు పెట్టాడు. ఆతని వెనుకనించి ఉమ 'మామయ్యా'.అంటూ పిలిచింది. అంతే...జగన్నాథం వెనక్కి తిరిగీతిరగకముందే ఆ కల కరిగిపోయింది.

ఒక వారంరోజులు తిరగకముందే ఉపదగ్గఅనుంచి జగన్నాథానికి ఓజాబు వచ్చింది. "అర్ధరాత్రి స్నానాలు నాయందు దయయుంచి, ఇక మానివేయవాఁ మామయ్యాఁ... " అన్న ముక్క ఒక్కటే అందులోని సారాంశం.

జగన్నాథం, తండ్రిచేసిన పనికి చాల బాధపడ్డాడు. ఈ విషయమై ఆమెకు ఉత్తరం వ్రాయడాని కాతనికి మనస్కరించలేదు. అసలు వీళ్ళందరికీ ఇంత భయ మెందుకో అతనికి బోధపడలేదు. 'పట్టి పిరికివాళ్ళు ! భయపెట్టడానికి, భయపడడానికితప్ప ఎందుకూ పనికిరారు' అనుకున్నాడు.

## 9

**1953** ఆగస్టు 12 న అమలాపురం నుంచి, కుటుంబరావుగారికి ఓ జాబువచ్చింది. ఆ ఉత్తరాన్ని ఆయనో విధంగా చివరవరకూ చదవలేక పోయాడు.

"ఈ ఉత్తరం చూసినవెంటనే టెలిగ్రాముగా భావించి, మన జగన్నాథాన్ని ఇక్కడకు పంపవలసిందిగా కోరుతున్నాను. ఉష ఒంట్లో ఒకవారం రోజులనుంచీ ఏమీ బాగుండడంలేదు. జగన్నాథం ఇక్కడనుంచి వెళ్ళినతరువాత అదినవ్వుతూ తిరగడం నేను చూడలేదు. కాలేజీలో చేరినతరువాత ఇలా మందకొడిగా ఉండదనుకున్నాను. కాని ఆ తరువాత కూడా అది అలాగేఉంది. వాళ్ళమ్మతో ఓ రోజున, 'చూశావా అమ్మా....మావయ్య ఉత్తరం వ్రాస్తే జవాబుకూడా వ్రాశాడు కాదు' అందట. అప్పటినుంచీ దాని దిగులు మరింత హెచ్చ

యిందని వాళ్ళమ్మ అంటూంది. ఈ వారం రోజులనుంచీ అది మూసినకన్ను తెరవడమే లేదు. ఒళ్లు చింతనిప్పుల్లా పేలి పోతుంది. రాత్రి 'మామయ్యా, మామయ్యా నా మాట వినవూ...ఇక్కడఉండు మావయ్యా' అని కలవరించింది. డాక్టరుగారు వెంటనే జగన్నాథాన్ని రప్పించమన్నారు. మాకే మిటో ఇదంతా చూస్తూఉంటే చాల భయంగాఉంది. వెంటనే జగన్నాథాన్ని ఇక్కడకు పంపిస్తారుకదూ...."

ఉత్తరం పూర్తయ్యేప్పటికి కుటుంబరావుగారి కాళ్ళల్లో వణకుపుట్టింది. అప్పటికే గోదావారిలో లాంచీలు తిరగడం మానేశాయి. గోదావరి మహాభయంకరంగా ఉంది. ఆ మరు నాటికి, నీరు కొంచమైనా తగ్గుతుందేమోనని ఆ రోజున ఆ విషయం, ఆయన కొడుకుతో చెప్పడం మానివేశాడు. కాని ఆమరునాడు నీరింకా ఉధృతంగానే ఉంది. కుటుంబరావుగారికి ఏమిచెయ్యడానికీ తోచలేదు. "ఈ ఒకరోజుకూ ఆగి, రేపెల్లాగో ఓలాగ జగన్నాథాన్ని అక్కడికి పంపించాలి" అనుకున్నాడు. "అయినా జ్వరమేగా....ఈ పాటికి తగ్గిపోకుండా ఉంటే టెలి గ్రామే ఇచ్చి ఉండేవారు; అంతే తప్పకుండా తగ్గిపోయి ఉంటుంది అనుకున్నాడు. కాని ఆమరునాడు 14 వ తారీఖున టెలిగ్రామే వచ్చింది. దాన్ని జగన్నాథం చదివి తండ్రికి విని పించాడు. పాపం కుటుంబరావుగారి మొహం పూర్తిగా కళా విహీనమై పోయింది. ఆయన ఆ ఉత్తరం సంగతి, కొడుకుకు చెప్పకుండా, "రేపు వెళ్దువుగానిలేరా....ఇవ్వాళ గోదావరి ఏమీ బాగులేదు. అయినా నువ్విప్పుడు వెళ్దామనుకున్నా...." అని ఆయన ఇంకా ఆ వాక్యం పూర్తిచెయ్యకముందే...జగ న్నాథం "నేనిందాక ఆ ఉత్తర చదివాను నాన్నా...." అని,

తల ఎత్తకుండా మూర్తీభవించిన శోకమూర్తిలా, మెల్లగా కదిలిపోయాడు. కుటుంబరావుగారి మొగం పూర్తిగా పాలిపోయింది.

ఆ రాత్రి జగన్నాధం ఎక్కడ ఈదుకుంటూ వెళ్ళిపోతాడో అని కుటుంబరావుగారు కాంతమ్మగారు నిద్రపోకుండా కూర్చున్నారు. జగన్నాధం, తల్లి మొగం కాని తండ్రి మొగం కాని చూడకుండా, మంచంమీద బోర్లపడుకున్నాడు. కొడుకుతో భోజనం చెయ్యమని చెప్పడానికే తల్లి భయపడి పోయింది. కుటుంబరావుగారు ఈ గండంనుంచి బయటబడ వేయమని వేయి దేవుళ్ళకు మ్రొక్కుకున్నాడు.

బయటగాలి ఉండి ఉండి విపరీతంగా విజృంభించి, ఇళ్ళ చూరులతో ఘోరంగా కుస్తీపడుతూంది. పెనుచీకటి, వీధుల నిండా అలముకొని, వెలుతుర్ని సమూలంగా నాశనం చేసే శాసన్న విజయగర్వంతో తననుతనే చూసుకోలేని స్థితికి వచ్చింది.

నిండుగోదావరి భయంకరంగా నినదిస్తూ గట్టులకు సరిసమానంగావచ్చి కోటానకోట్ల ఏనుగుల గుంపు ఒక్కుమ్మడిగా కదలిపోతూన్నట్లు సాగిపోతూంది. అఖండమైన ప్రవాహపు శక్తి "హోరున" సాగరోన్ముఖమై వెడలిపోతూంది.

ఇంతలో ఒక కొండంతమనిషి, ఆ ఉప్పెన కడ్డుపడి, నేల బారున వదిలిన తారాజువ్వలా ఆ ప్రవాహపు మధ్యభాగానికి చొచ్చుకొని పోయాడు. పంచప్రాణాలూ ఒక్కచోటకుచేర్చి, "నాయనా... వెళ్ళకు... వెళ్ళకు" అంటూ ఒడ్డున ఎవ్వరో ఘోరంగా విలపించారు.

"అమ్మనాయనో...నాకొడుకేడీ..." అంటూ ఆతల్లి, ఒక్కసారి గుండెలు బాదుకుంది. "ఏమండీ...జగన్నాథం ఏడీ...ఏమిటా పలవరింతలు...త్వరగా లేవండీ...పరుగెత్తండీ' అంటూ నిద్రలోమునిగి కలలుగంటూన్న కుటుంబరావుగార్ని ఆవిడ ఏడ్పులతో లేపింది.

"ఆఁ...ఏమయ్యాడు? ఎడీవాడు...నాకు చాలాచెడ్డ కలొచ్చింది..." అంటూ ఆయన వీధిలోకి పరుగెత్తాడు.

కాంతమ్మగారు గుండెలు బాదుకుంటూ పెద్దగా ఏడ్వ డం మొదలుపెట్టింది. కుటుంబరావుగారు మతిపోయినవాడిలా వీధినిబడి ఆ అర్ధరాత్రి గోదావరి దిక్కుగా పరుగెత్తాడు.

కాంతమ్మగార్ని ఓదార్చడానికి ఇరుగు పొరుగు స్త్రీలు కొంతమంది ఆమెచుట్టూ మూగారు. కొంతమంది ఆ వీధిలోని పెద్దమనుష్యులు కుటుంబరావుగార్ని అనుసరించారు.

కుటుంబరావుగారి గుండెల్లోంచి, ఉవ్వెత్తుగా పాతా ళాన్ని చీల్చుకొని పైకుబికే జలంవలె దుఃఖం పొంగుకొచ్చింది. ఆ పొంగు నణచుకోడానికి ఆయన తనకున్న శక్తినంతా ఉప యోగించాడు. అతి కష్టంమీాద తన కంటిపాపల వెనుక దానికి ఆత్మాభిమానం మూత బిగించాడు!

ఆయనను అనుసరించిన వారిలో ఒక్కరికీ మాట పెగిలి రాలేదు. కాని వారు 'ఇదేం పని' 'ఇదేం పని' అని ఎవ రికి వారు అనుకున్నారు.

"మంచివాడేనండి... అసలు ఎందుకిలా చేశా డంటారు..." అని ఒకరు "ఇంట్లో పోట్లాట ఏమైనా

వచ్చిందా " అని మరొకరు " అబ్బే ! ఆ అబ్బాయికి గోదా
వరంటే తగని ఇష్టం " అని వేరొకరు " పెంచి పెద్దచేసిందే
కాకుండా ఇలా గుండెల్లో నిప్పులు పోసి ఎందు కేడిపిస్తూ
ఉంటారో ఏమిటో ఈ పిల్లలు . . . " అని మరొకాయన ఏమి
టేమిటో అనుకున్నారు.

ఇంతలో మాష్టారు అందుకొని, "జగన్నాథానికి ఏమీ
ఫరవాలేదండి. వాడు తనకు చేతగాని పని ఏమీ చెయ్యడు.
కుటుంబరావుగారూ, . . మీరేమీ బెంగపెట్టుకోకండీ . .,"
అన్నాడు.

కుటుంబరావుగారు ఏమీ మాట్లాడలేదు. అప్పు
డాయన మనస్సు పూర్తిగా భగవంతునిమీదకు మళ్ళీపో
యింది. " ఓయి ప్రభూ . . . నా కొడుకును రక్షించు . , .
వాడిని రక్షించు ప్రభూ . . . " అని దీనంగా అకసంవైపు
చూశాడు.

ఇంతలో " ఎక్కడికి నాన్నా . . . మీరంతా ఎక్క
డికి వెళ్తున్నారు ? " అన్న జగన్నాథం కంఠం ఒక్కసారిగా
వారికి వినిపించింది. ఆ వీధికి, రెండు వీధుల అవతల పెద్దతూము
మీద కూర్చొని ఏమిటో ఆలోచించుకుంటూన్న జగన్నాథం
వాళ్ళను చూసి విస్తుపోయాడు.

కుటుంబరావుగారు తన ఆనందాన్ని ఆ సమయంలో
పాపం ఏవిధంగాను, వ్యక్తపరచడానికి వీల్లేని పరిస్థితి వచ్చింది.
ఇంతమందిని ఈ నడిరేయి బాధపెట్టిన కొడుకును తిట్టాలో—
తన ప్రాణంలోని ప్రాణం క్షేమంగా లభించినందులకు సంతో
షించాలో — ఆయనకు తోచలేదు.

మాష్టరుగారు " బలేవాడివే. ... నువ్విక్కడ ఉన్నావా జగన్నాధం ... రా ... రా ... ఇంటికి పోదాం " అంటూ జగన్నాధాన్ని ఇంటికి నడిపించాడు.

అంతమందిలో — పాపం జగన్నాధం తల ఏదో భరించలేని అవమానంతో భూమిలోకి దించుకపోయింది. ఇంటికి వెళ్ళేటప్పటికి ఆతల్లి రోదనలు, అక్కడ గుమిగూడిన స్త్రీల ఓదార్పు మాటలు విన్న జగన్నాధం నిలువునా చచ్చిపోయాడు. అతనిమీదనుంచి, లక్షలకొద్దీ జనం — కాళ్ళతో త్రొక్కుకుంటూ వెళ్ళిపోయినట్లయింది.

మరునాడు 15-8-53 న మరీ ఉధృతంగా ఉంది. ఆవేళ తెల్లవారుఝామున ధవళేశ్వరం వద్ద గండి పడింది.

ఆవేళ గట్టుమీద జనం కిటకిట లాడిపోతున్నారు. జన్మలో తిరిగి ఇంతనీరు చూడగలమో లేమో అని వారు తమ కళ్ళతో ఆ దృశ్యాన్ని అనేక రకాల కోణాల్లో ఫొటోలు తీసుకొని జ్ఞాపకాల ఆల్బంలో భద్రం చేసుకుంటున్నారు. వారి కిలకిలలు, పకపకలు మిన్ను ముట్టుతున్నాయి.

బంగారునగల షోరూములా ఉన్న ఒక రోడ్డు రోలరు తల్లి, తన బట్టతలమీద మిగిలిన నాల్గు పరకల జుత్తుముడిలోని పసిడినాగును ఓసారి తడివి చూసుకుంది. 'అమ్మయ్యో' అని ఒక పొలికేక పెట్టింది. ఎవరో "పాము .... పాము" అన్నారు. ఇంతలోకింకొకరెవ్వరో. "పాపం పాపం..." అన్నారు. "ఛీ... వెధవ... అక్కచెల్లెళ్ళు లేరూ ..." అంది ఓపిల్ల. నదిలో కొట్టుకొనిపోతూన్న మహావృక్షపు వేళ్ళులాఉన్న ఓచింపిరితల ముసలిది, " తల్లీ ... మా పాపాలు కడిగివేయమ్మా"

అంది. నది, "అంతపనీ జరిగేట్లుగానే ఉంది" అంది. ఆభాష ఎవ్వరికీ అర్థం కాలేదు. అసలాఘోష వినేదెవ్వరు? వినడానికి ఓపికేదీ . . .

చిల్లికాని కలవాటుపడ్డ పసిపిల్లకు రూపాయిస్తే విసిరేసి నట్లు, గలగలా పారుతూన్న ఆ బంగారు జలకణాల నదీమ తల్లిని ఈ మానవులు సముద్రంలోకి తరిమేస్తున్నారు. అలాచేసి ఎంత గట్టిగా నవ్వుకుంటున్నారు!

నది, అంతకంతకూ పొంగిపోతోంది. ఆయమ కెక్కడా ఊపిరి సలపడం లేదు. ఆమె; తనను తను ఇక ఏమాత్రం సంబా ళించుకోనే స్థితిలో లేదు. "పొండి . . , పొండి . . . నాకు దూరంగా తొలగిపొండి...మీ ప్రాణాలు వేగంగా కాపాడు కోండి..." అని ఆమె ఎంతో ఎర్రగా హెచ్చరించింది. 'నామాటవినండి...ఊ....పారిపొండి' అని నురుగులు గ్రక్కుతూ ఆయాసపడింది. కాని ఎవరు విన్నారు? ఆ తల్లి చెప్పినమాట ఎవరు చెవిని బెట్టారు?

గోదావరి తల్లి పుట్టి ఎరుగదీ బాధ! ఆమెకొక్కటే తపన! ఎట్లా ఈ పసిపాపలకు తన పరిస్థితి చెప్పాలీ...అనే! ఆమెగట్టిగా ఒకసారి "భోరున" ఎలిగెత్తింది "ఇకపొండర్రా పొండి...ఈ ఇరుకు గుమ్మాలకు నేనుఒదిగి ఉండలేను ఊ.... త్వరగా పొండి...మీ కొంపలు కూలిపోతాయి మీ పొలాలు ఇసుకతో పూడుకపోతాయి...మీ ఇళ్లు నేలమట్టమై పోతా యి... మీ ఆస్తులు మరికనిపించవు....త్వరగా పారిపొండి... అబబ్బ! నే నాపుకోలేను.... నే నాపలేను ఈ గుండె బరువు! ఎక్కడిదీ నీరు... పసివాని తలపైన కళ్ళుమూసుకపోయి పోసే

స్తున్నట్లు, ఏమిటి నా నెత్తిమీద ఈ కుంభవృష్టి! నా చిట్టి తల్లి శబ్బరి పర్వతాలెత్తున నీటిని మోసుకొస్తూంది! అయ్యో! నాకిన్నెర తలకు మించిన బరువుతో తలక్రిందులై పోతూంది! ఈ గిరులు కరిగి పోతూన్నాయి.

ఈ రహదారులు మూసుక పోతున్నాయి...అబ్బబ్బ! ఎన్ని సెలయేళ్ళు! ఎన్ని సెలయేళ్ళు! నేను ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాను...నా పైనుంచి, ప్రక్కలనుంచి అంతా నీరే! నేనాగలేను. నన్ను నేనాపుకోలేను...నేను పరుగెత్తే ఎర్రసముద్రాన్ని....నాకడ్డు నిలవకండి...ఊ...పారిపొండి.... అబ్బబ్బ! ఎక్కడినుంచి వచ్చారమ్మా ఓ మబ్బులు! కావాలంటే కనిపించరు....అక్కర్లేదంటే అంతటా మీరే. ఈ నా శిరోభాగానికి ఎక్కడనుంచమ్మా వచ్చిపడుతున్నారు? ఏ రైలుబండిమీద బయలుదేరారు? మీ రాగవలసిన చోటెక్కడ...? అయ్యో! ఈ మేఘాల మెయిలుబండి నా నెత్తిమీదే పట్టాలు తప్పిపోయిందా...అయ్యో!

గోదావరిగట్టున నడుస్తూన్న జగన్నాథం భుజంమీద చల్లగా ఓ చేయిపడింది. "ఇంక ఇంటికి పోదాంరా...జగన్నాథం...." అంటూ అతిదీనంగా ఓ కంఠం వినిపించింది. జగన్నాథం వెనుదిరిగి చూసేసరికి ఇంకెవ్వరు...

"నువ్వాఁ...నాన్నాఁ..." అన్నాడు జగన్నాథం. కుటుంబరావుగారి కనుల వెంట నీళ్లు జలజల రాలాయి.

ఆ రాత్రి ఎవ్వరికీ నిద్రలేదు. వీధుల్లో హెచ్చరికలు వినిపిస్తూనే ఉన్నాయి. వాటిని ఈ సడించేవాళ్ళు ఈ సడిస్తూనే ఉన్నారు. కొంతమంది ఇళ్ళు ఖాళీచేస్తూనే ఉన్నారు.

ఆకసంలో చుక్కలు ఏ అడ్డూలేకుండా వెలుగుతున్నాయి. ఆరురోజుల చంద్రుడు రాబోయే ఉపద్రవం తెలిసినవాడు అమితదుఃఖంతో ఆకసపు అంచుకు దిగజారి పోతున్నాడు.

ఆ రోజున మాష్టరుగారికి పూర్తిగా మతిపోయిందనే చెప్పాలి. ఒక ప్రక్క ఇళ్ళు ఖాళీచేసి పారిపొండని హెచ్చరికలు వింటున్నాడు. మరొకప్రక్క, ఎప్పుడూ లేదు, నీరు ఇక్కడి కెందుకువస్తుందని తన గుండెకు ధైర్యం చెప్పుకుంటున్నాడు. కాని వీటి అన్నిటికన్నా బాధగా పరిణమించినది ఆయన భార్య, ఆవేళ పురిటినొప్పులు పడుతూంది. అది తలచుకుంటూ ఉంటేనే ఆయనకు మూర్ఛపర్యంతమూ అవుతూంది.

వారి ఇంటిదగ్గర చేరిన ఇరుగుపొరుగు అమ్మలక్కలు, మంత్రసానిని తీసుకరావడంకన్నా, హాస్పిటల్ కు తీసుకుపోవడమే మంచిదని ఆయనకు సలహా ఇచ్చారు.

అరుగుమీద కూర్చొని, ఆకసంలోని ప్రతిచుక్కలోనూ ఉషను వీక్షిస్తూ, "క్షమించు ఉషా...ఈ ఒకరోజు ఆలస్యానికి క్షమించు ...వచ్చిననింద ఎలాగూ వచ్చింది... ఇంక ఈ రాత్రి ఇక్కడ ఏ విధంగానూ ఉండను ఉషా"...అనుకుంటూ తనలోకంలో నిమగ్నుడై పోయిన జగన్నాధాన్ని— ఆ మాష్టరుగారు పిలిచి, "జగన్నాదం...వేగంపోయి ఓ రిక్షా తెచ్చిపెట్టు బాబూ" అన్నాడు. జగన్నాధం మొదట ఆ మాష్టరుగారి కళ్ళల్లోకి వెర్రిగాచూసి, ఆ తరువాత "అలాగేనండీ..." అంటూ ఏదో తప్పుచేసినవాడిలా వీధిలోకి పరుగెట్టాడు. ఇంతలో ఓ ఆవిడ "ఏం మాష్టరు వయ్యా...రిక్షా

తెమ్మన్నావట ! బలేవాడివి...పోయి ఒంటెద్దుబండిని లాక్కు-రా...."అంది. పాపం మాష్టరు ఆ బండికోసం, ఇంటి వెనుక భాగం వైపు గబగబా బయలుదేరాడు.

అంతే .... తుమ్మలాం...ఆర్యాపురం ... సీతమ్మపేట, ఒక్కసారి పేపరు మిల్లువద్ద పడ్డ గండితో గొల్లుమంది! ప్రతి వాని గుండె ఝల్లుమంది! ఎక్కడికి పోవాలి? ఎలాపోవాలి? ఈ ఇల్లూ ఈ వాకిలీ వదిలి ఎలా పారిపోవాలి? అసలు పారి పోడానికి మార్గం ఏది? గాలిలో పరుగెత్తు తూన్నవాడు ఇంత లోనే నీళ్ళల్లో ఉంటున్నాడు. హెచ్చరికలు చేస్తూన్నవారి కరుణవల్ల దూరంగా ఉన్నవారు ప్రమాదాన్ని తప్పించుకోగల్లు తున్నారు. మిగిలినవారు ఎవరికివారే యమునాతీరే అయి పోతున్నారు. ఎవరి ప్రాణాల్ని వారు కాపాడుకోడానికి ఇల్లే మిటి, విద్యుత్ స్తంభమేమిటి ఏదిబడితే అదే ఎక్కిపోతు న్నారు. అందరిదీ ఒకేబాధ! ఈ ప్రాణాల్ని ఎలా కాపాడుకో వాలి? ఎలా....అనే బాధ! ఈ అసువుల్ని రక్షించడానికి ఈ శరీరం దాడుతీస్తూందో...లేక ఆ ప్రాణాలు, తమను తామే కాపాడుకోటానికి ఈ శరీరాలను గుర్రాల్లా పరుగులెత్తిస్తు న్నారెమో! ఏమో... మనిషికి ఉన్న ధనమల్లా ఒక్క ప్రాణమే. ఆ ధనాన్ని చనిపోయేవరకు పదిలం చేసుకోడానికి అబ్బ! అతను ఎంత తాపత్రయ పడతాడు!

రిక్షాకోసం వెళ్ళిన జగన్నాథంకోసం అతని తల్లి తల్ల డిల్లిపోయింది. కుటుంబరావుగారితో ఆమె, "ఎలాగండీ...వా డింకా రాలేదు..." అంది. ఆయన వెంటనే "వాడికోసం మనం చూడక్కర్లేదు. వాడు మనకు ఎదురౌతాడు. త్వరగా బయలు

దేరు. ఊ...ఆలస్యం చేయకు" అని ఆయన ఆమెను తొందర చేశాడు. కాని ఆమె "మాష్టరుగారి భార్య నిండుచూలాలు... ఆమె దగ్గిర ఎవ్వరూ లేరే....ఎలా" అంది. దాని కాయన "ఆమె కేం ఫరవాలేదు, ఈపాటికి మాష్టారు బండితీసుకొస్తూనే ఉంటాడు. నీరు ఇంకా ఇక్కడకు రాలేదుగా....ఆమెను ఆయన క్షేమంగానే తీసుకరాగలడు. ఊ...ఇంక నువ్వు త్వరగా బయలుదేరాలి..." అన్నాడు. పాపం కాంతమ్మగారు "ఎలా గండి.. ఈ ఇల్లూ, ఈ సామానూ...." అని ఒక్కసారి బావురు మంది. ఆయన "నీకేమైనా మతిపోయిందా ఏం? పోతే పోయాయి త్వరగా పద....ఊ" అంటూ ఆయన ఆమెను వీధి లోనికి నడిపించుకుంటూ బయలుదేరాడు.

కొంతదూరం వెళ్ళిన తరువాత రిక్షామీద గబగబా వెళ్ళిపోతూన్న జగన్నాథం, కుటుంబరావుగారికి కనిపించాడు. ఆయన కొద్దిగా తలఎత్తిచూడకపోతే దాటిపోయేవాడే... "ఒరే జగన్నాథం ఆగు....ఆగు" అంటూ ఆయన అతన్ని ఆపుచేశాడు.

జగన్నాథం రిక్షాదిగి "మాష్టరుగారు ఏరి నాన్నా... ఆవిణ్ణెలాతీసుకొస్తున్నారు...." అన్నాడు ఆత్రుతతో. కుటుంబ రావుగారు "మాష్టరుగారుఒం టెద్దుబండికోసం వెళ్ళారు. ఆబండి మీద ఆవిణ్ణి తీసుకొస్తాడు. మనం పోదాం పద..." అన్నాడు. "అదేమిటి నాన్నా... అటునుంచి ఇక బండి ఎలావస్తుంది ? ఆవిణ్ణి వదిలేసి ఎలావచ్చారు, నాన్నా?.... పదండి నాన్నా ... అవిణ్ణి నేనెలాగోలాగ తీసుకొచ్చేస్తాను. ఇక ఈరిక్షాకూడ ఈ నీళ్ళల్లో నడవలేదు. ఇంక ఆలస్యం చెయ్యగూడదు" అంటున్న జగన్నాథం మాటలు కుటుంబరావుగారి తలమీద పిడుగులా

పడ్డాయి. ఆయన నిజం చెప్పడం ఎంత పొరపాటైంది అనుకున్నాడు. ఇలాంటి సమయములో మెత్తగా చెప్పడంవల్ల ఫలితం ఉండ దనుకున్నాడో ఏమో.... "ఏమిటిరా నువ్వనేది.... నీకేమయినా తలతిరుగుతూందా? మాష్టారు ఆవిణ్ణి తప్పకుండా తీసుకొస్తాడు పద. ఇంకా నీరు ఆట్టే రాలేదు. ఆయన ఏదో ఒకటి చెయ్యకుండా, ఆవిణ్ణి అక్కడ గాలికి వదిలేస్తాడా ఏమిటి? రా... పోదాం...." అన్నాడాయన.

జగన్నాథం "అబ్బే.... ఇంకాయన ఏమీచేయలేదు నాన్నా...బహుశా ఆయన అటే సినిమావైపు వెళ్ళిపోయి ఉంటాడు. పాపం! ఆవిడ ఊరికనే చచ్చిపోతుంది. నాన్నా... ఆలస్యం చేస్తే ఇంక ఏం లాభం లేదు నాన్నా ... " అని అతను తండ్రి అనుజ్ఞకోసం ఎదురు చూడకుండానే ముందుకు పరుగెత్తబోయాడు. కుటుంబరావు "ఏమిటిరా . . . నీ ఆగడం" అంటూ జగన్నాథం చేయి గట్టిగా పట్టుకున్నాడు.

ఎప్పుడైతే తండ్రి తన చేతిని పట్టుకున్నాడో జగన్నాథానికి అప్పుడు పిచ్చి ఆవేశం వచ్చింది. అతని కళ్ళల్లోకి వెర్రిగాచూస్తూ, తనను రక్షించమని, ఆ మాష్టరుగారి భార్య ప్రాణభీతితో తల్లడిల్లిపోతూ, ఆర్తనాదాలతో మెలికలు తిరిగిపోతూన్నట్లు అతనికి కనిపించింది. అతను తల్లినీ, తండ్రినీ, ఉషనూ, అందరినీ మరచిపోయాడు. వారిలోని ఏ ఒక్కరి ప్రేమా, మమకారమూ, ఆతని ప్రయత్నాన్ని విరమింపజేయడానికి భయపడిపోయాయి. అతను తనను తనే మరిచిపోయాడు. అ మరపులో తండ్రి తనను గట్టిగా పట్టుకున్నాడన్న

భావంకూడా ఆతనికి కలుగలేదు. జగన్నాథం ఏ అడ్డూ లేనట్టుగా ముందుకు సాగిపోయాడు. అబ్బ! ఎంత బలం! కుటుంబరావుగారి పట్టు ఇట్టె సడలిపోయింది. కాంతమ్మగారు గుండెలు బయిటికి ఊడివచ్చేలా ఒక్కగావుకేక పెట్టి, కొడుకు ముందుకు పోకుండా గట్టిగా పట్టుకుంది. తిరిగి కుటుంబరావుగారు అతన్ని కదలకుండా పట్టుకున్నాడు.

జగన్నాథంలో ఏమహాశక్తి ఆవేశించిందో ఒక్కసారిగా ఆతను "నాన్నా ... నాన్నా ... నన్ను చంపేయండి. నన్ను చంపేయండి" అని గట్టిగా విలపించాడు. "నన్నెందుకు నాన్నా ... ఇలా చంపుతారు. నేనేం పాపం చేశానని నాకీ ఉరిశిక్ష విధిస్తున్నారు, నిన్నకు నిన్న ... అంతమంది లోన ... నా గుండెల్ని చిదకపొడిచేశారు. ఆ అమలాపురం పంపి అక్కడ, ఆయనగారితో నాతలను బ్రద్దలు చేయించారు. అక్కడనుంచి ఇక్కడకు వచ్చిన తరువాత మీరు తిరిగి అంతపని చేశారు. అబ్బ! ఎందుకొచ్చిన ప్రేమ నాన్నా ఇది. ఈ స్వార్థంతో మీరు ఉపప్రాణాలు హరించడానికికూడ వెనుకాడలేదు. తిరిగి మళ్ళీ అదే పని చేస్తున్నారు. నాన్నా ... నాన్నా ... నీకన్నీ తెలుసు నాన్నా ... మమకారాన్ని కొంచెంసేపు ఆవలకు నెట్టి, దాన్ని పూర్తిగా, మరచిపోయి, కొంచెం దూరదృష్టితో ఆలోచించు నాన్నా ... అమ్మా నువ్వైనా చెప్పమ్మా ... పాపం ఆవిడ అక్కడ గిలగిల కొట్టుకుంటూ చచ్చిపోవడం నీ కిష్టమటమ్మా ...? ఆవిడ నిజంగా చచ్చిపోతే ఆ పాపం మనదేనమ్మా ... ముఖ్యంగా నాదేనమ్మా!"

ఈ మాటలు ఆ తలిదండ్రుల మనసుమీద ఏమిగారడీ చేశాఘోకాని, వారిచేతులు వారికి తెలియకుండానే అతనిని విడిచిపెట్టేశాయి. కాంతమ్మగారు, ఒక్కసారి వెన్నులో ఎవ్వరో కత్తితో పొడిచినట్లు కెవ్వున అరచి, "జగన్నాథం" అంటూ ముందుకు చేతులుచాచి రోదించింది. కాని ఇంకెక్కడి జగన్నాథం . . .

ఆ దృశ్యం నిజంగా హృదయవిదారకంగా ఉంది. పిల్లల ఆక్రందనలు పెద్దవారి రోదనలు భరించ నలవికానివిగా ఉన్నాయి. వారి బాధల విజ్ఞాపనలు ఏదేవునిదరికీ చేరడం లేదు.

నిజంగా ఈ ముంపు ఈ మానవులందరికీ తలవంపు! ఇది జరుగవలసిందికాదు. కాని జరిగింది!

ఆకసంలో చుక్కలలాగే వెలుగుతున్నాయి. పాపం వాటికి ఈ ఆక్రందనలు వినిపించడమే లేదు. వాటికీ మనకీ మధ్య రేడియో ఉంటే వాటికీ మనకీ మధ్య టెలివిజన్ ఉంటే . . , అవి మన కెంత సహాయపడేవి! అయ్యోరాత! తెరమీద కాలిపోతూన్న కొంపల్ని ప్రేక్షకుడు ఆర్పగలడు? ఔను. ఎవరు ఆర్పగలరు? ఆ తెరలోని జీవులే దాన్ని ఆర్పు కోవాలి! అంతే! అవును అంతే . . . అంతవరకూ ఈ ఇళ్ళు, ఇలా కూలిపోవలసిందే . . . ఈ మానవాళిశ్రమ ఇలా నీట గలిసిపోవలసిందే . . .

నిట్టనిలువుగా ఉన్న పర్వతం ఎక్కుతూన్నప్పుడుకూడా ఇంత కష్టముండదేమో! నీటి కెదురీదుతూన్న జగన్నాథం ఎప్పుడో కొండ ఎక్కిన గుర్తు జ్ఞాపకం చేసుకున్నాడు. ఆ పై

నుంచి రాలిపోతూన్న ట్లనిపించినప్పటి భావం అతని గుండెను ఆవరించింది. అప్పుడే ఉష, పకపక నవ్వుతూ, "లాంచీలో పుట్టినవాళ్ళు నీటిలో పడితే . . . అంతే అవుతుంది; ఆ చేప గతే పడుతుంది" అంది. ఆ చేప — లాంచీ కళాసు చేతిలో క్రూరంగా చంపబడటం, ఆతని కళ్ళముందు ప్రత్యక్షమయింది. ఇంతలో తిరిగి అతని కళ్ళముందుకు వచ్చి, "ఇంత నిర్ద యుడ వనుకోలేదు. మామయ్యా, ఈ చీకటిలో నువ్వు వెళ్ళిపోవడం ఏమీ బాగులేదు...." అని విలపించింది. జగన్నా థం, "ఉషా, నాకేం భయంలేదు. అసలు అంత భయం దేనికి ఉషా? భయంతో మనం ఎన్నాళ్ళు బ్రతుకుతాం? బలే పిచ్చి దానవే" అంటూ జగన్నాథం ముందుకు త్రోసుకు పోయాడు.

అతి కష్టంమీద అతను, ఆ ఇంటి స్తంభాన్ని అందుకు న్నాడు. గట్టిగా ఆ స్తంభం పుచ్చుకుని లోపలిగదిలోనికి ప్రవే శించాడు. ఆగదిలో మంచంమీద, నీటికి ఇంటి చూరుకుమధ్య, ప్రాణాలను గంగమ్మ తల్లికి అర్పించడానికి సిద్ధంగా ఉన్న ఆ నిండు చూలాలు, జగన్నాథాన్ని చూడగానే, ఒక్క సారిగా చావంటే ఏమిటో మరచిపోయింది. అంతవరకూ ఏడ్చి ఏడ్చి ఇక ఏమాత్రం ఏడ్వడానికికూడా ఓపిక లేనంతగా అలసి పోయిన ఆమె బిగ్గరగా, "జగన్నాథం... జగన్నాథం...నాయనా నువ్వు దేవుడివి....నువ్వు దేవుడివి" అంది ఆతల్లి. అబ్బ ఆమె కళ్ళల్లో కృతజ్ఞత గోదావరివలె ఉప్పొంగింది. ఆమె తన చేతి లోని హరికేన్ లాంతరుతో దారి చూపింది, జగన్నాథం ముందు మంచం బయటకు దాటించి ఆమెను జాగ్రత్తగా, భయపడకుండా ఆ మంచం మీద కూర్చుండమని, ఇంక ఒక దెబ్బని ఒడ్డుకు చేరుకో గలమన్న ధీమాతో తను సాధించిన

ఈ మహత్తర కార్యానికి హృదయాంతరాళంలో ఉప్పతిల్లిన ఎనలేని ఆనంద తరంగాలలో ఈదులాడుతూ, ఇంటి కప్పును దాటి, ఇలా భయంకరమైన నదిలోనికి చొరబడ్డాడో లేదో— ఆ ఇంటికప్పు భళ్ళున కూలిపోయింది. జగన్నాథం దబ్బున నీళ్ళలోనికి మునిగిపోయి ఆమంచాన్ని నదిలోనికి బలంగా త్రోశాడు. అంతే.... అతను తిరిగి పైకితల ఎత్తేసరికి—అయ్యో పాపం! ఆ కలపకుమాత్రం ఏమి తెలుసు? ఎన్నో అంపపు కోతలబడి, కలపగా, రాతి పలకగా మారిపోయింది. దాని గుండె ఎప్పుడో చచ్చిపోయింది. పచ్చనాకుల చెట్టయితే పచ్చి నెత్తురు తాగుతుందా? ఆ శిరస్సు ఒక త్యాగమూర్తిదని, ఆ నేత్రాలు, తోటి మానవుల బాధలు నివారణకై కరుణ రసపు దివ్యౌషధాన్ని ఒలకబోసేవని, ఆ శ్రవణేంద్రియాలు, ఆక్రందనలు వినిపించిన చోటికి రెక్కలు కట్టుకొని వాలేవని, ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసలు జనావళి బాధల విముక్తికి బలిగా ఆగిపోవడానికి సిద్ధపడేవని, అయ్యయ్యో! దానికి తెలియదు.

దానికేమీ తెలియదు! బ్రహ్మరాక్షసుడిలా అతని తలను బ్రద్దలుచేస్తూ తీరని రక్తదాహంతో నదిలో వడివడిగా ముందుకు సాగిపోవడం ఒక్కటే దానికి తెలిసింది...అంతే....

'అమ్మా!' అంటూ జగన్నాథం ప్రాణవాయువులు ఆ గోదావరీ తల్లి ఎదలో లీనమైపోయాయి.

ఏ తల్లి అతన్ని ఇన్నాళ్ళు పెంచి పెద్ద చేసిందో...ఆ తల్లి "అయ్యో! జగన్నాథం నీమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానోయ్" అంటూ భోరున విలపించింది.

ఈ దృశ్యం చూడలేని బాలచంద్రుడు ఆకసాన అస్తమించిపోయాడు.

ఈ భయానక దృశ్యాన్ని చూసిన మాష్టరుగారి భార్య "జగన్నాథం....జగన్నాథం...అయ్యో దేవుడివైన నీకే చావు మూడిందా నాయనా అయ్యో..." అంటూ తెలివి తప్పి పడిపోయింది.

అప్పుడే ఈ మహాప్రళయంలోనికి జగన్నాథం ఊహలకు ప్రాణంగా "కేర్"మని ఒక శిశువు అవతరించింది.